శుక్రవారం
9-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 227
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భీకర దాడులు

పాక్ దుస్సాహసం

- డ్రోన్లు, క్షిపణులు, యుద్ధవిమానాలతో దాడి
- తిప్పికొట్టిన భారత బలగాలు
- మూడు యుద్ధ విమానాలు, 12 డ్రోన్లు కూల్చివేత
- గడప దాటొద్దని ప్రజలకు హెచ్చరికలు
- జమ్ము, కుప్వారా, పూంచ్‌లో సైరన్ల మోత
- 8 పాకిస్థానీ క్షిపణులను ఎస్-400 వ్యవస్థతో ధ్వంసం

జమ్మూ, పంజాబ్, రాజస్థాన్ బ్లాక్అవుట్

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో జమ్మూలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భారత్ మెరుపు దాడులతో బిక్కచచ్చిన పాకిస్థాన్... తన ఉనికి చాటుకొనేందుకు ప్రయత్నిస్తోంది. జమ్మూ లక్ష్యంగా దాడులకు తెగబడింది. జమ్మూ విమానాశ్రయం సమీపంలో పాకిస్థాన్ ఆత్మాహుతి డ్రోన్ దాడులకు పాల్పడింది. సర్వసన్నద్ధంగా ఉన్న భారత సైన్యం పాక్ దాడుల్ని తిప్పికొట్టింది. జమ్మూ, పంజాబ్ మొత్తం బ్లాకౌట్ కాగా రాజస్థాన్‌లోని కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అఖ్నూర్, కిష్త్వార్, సాంబా సెక్టార్‌లో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జమ్మూ జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగించారు. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా

- మిగతా 2 లో

పాక్ దాడుల్ని తిప్పికొట్టాం

- గగనతల రక్షణ వ్యవస్థలే సైన్యం లక్ష్యం
- లాహోర్ ఎయిర్ డిఫెన్స్ ధ్వంసం

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ విరుచుకుపడింది. ఆపరేషన్ సిందూర్ పేరిట తొమ్మిది ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. 2లో

ఉగ్రవాదం, మతోన్మాదమే శత్రువులు

భారత్-పాక్ సంయమనం పాటించాలి: సీపీఐ 2లో

100 మంది ఉగ్రవాదులు హతం

- పాక్ రెచ్చగొడితే వెనక్కి తగ్గం
- అఖిలపక్షంలో రాజ్‌నాథ్ సింగ్
- పూర్తి మద్దతిచ్చిన ప్రతిపక్షాలు: రిజిజు
- పార్లమెంటు సమావేశం కావాలి: రాహుల్
- ప్రధాని రావాల్సింది: ఖర్గే

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం అఖిలపక్ష సమావేశానికి వెల్లడించారు. ఆపరేషన్

- మిగతా 2 లో

మసూద్ సోదరుడు అబ్దుల్ రవూఫ్ హతం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ చిరకాల ప్రతీకారం కూడా తీరింది. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్ సూత్రధారి, జైషే మహ్మద్ ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అజార్ హతమయ్యాడు. బహావల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ కాంప్లెక్‌పై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు కలిపి 14 మరణించారు. వీరిలో రవూఫ్ అజార్ ఉన్నట్లు తెలుస్తోంది. మసూద్ అజార్ ఆజార్ సోదరుడే

- మిగతా 2 లో

లాలు విచారణకు రాష్ట్రపతి అనుమతి

న్యూఢిల్లీ: స్థలానికి బదులుగా ఉద్యోగం కుంభకోణంలో ఆర్‌జేడీ అధినేత, కేంద్ర మాజీమంత్రి లాలు ప్రసాద్ యాదవ్ విచారణకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనుమతించారు. బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 218, సీఆర్పీసీలోని 197(1) సెక్షన్ కింద రాష్ట్రపతి నుంచి విచారణానుమతులు లభించినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. లాలు కేసు ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో ఉంది. లాలుతో పాటు ఆయన తనయుడు తేజస్వీ యాదవ్, మిగతా కుటుంబ సభ్యులపై ఈడీ గతేడాది ఆగస్టులో మనీలాండరింగ్ కేసు

- మిగతా 2 లో

జెత్వానీ కేసులో ఐపీఎస్‌లకు ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ముంబై నటి జెత్వానీ కేసులో ఇద్దరు ఐపీఎస్ అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో ఐపీఎస్ అధికారులు నాటి విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా, డీసీపీ విశాల్ గున్నీ, ఏసీపీ పోలీసు అధికారులు హనుమంతరావు, సత్యనారాయణలపై తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే క్వాష్ పిటిషన్లపై తుది విచారణను జూన్ 30కు హైకోర్టు వాయిదా వేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నటి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

భారత్ వైపు కన్నెత్తి చూస్తే...

నూకలు చెల్లినట్లే

సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరిక

సైన్యానికి సంఘీభావంగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో చేపట్టిన ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ముష్కరులకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని... భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి' అని అన్నారు. 'బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి మహాత్మాగాంధీ అమరుడయ్యారు. ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛ అనుభవిస్తున్నాం. ఆయన శాంతి

- మిగతా 2 లో

హైడ్రా ఆక్రమణలు ఉపేక్షించదు

ప్రజలకు మేలు జరిగే పనులు అడ్డుకోవద్దు

హైదరాబాద్ నగరాన్ని పరిరక్షించుకుందాం: సీఎం రేవంత్

విశాలాంధ్ర- హైదరాబాద్ : విద్యుక్తధర్మంలో భాగంగా హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఒక మంచి ఆలోచనతో చారిత్రక నగరం హైదరాబాద్ పరిరక్షణకు హైడ్రాను ఏర్పాటు చేసిందని చెప్పారు. 1908లో వచ్చిన వరదలు నిజాం ప్రభుత్వాన్ని కదిలించాయని, ఆనాడు వరదల నివారణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ద్వారా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను నిజాం నిర్మించారని వివరించారు. మన నగరాన్ని

- మిగతా 2 లో

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

- రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు
- రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం
- రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు: భట్టి

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రూ. 22,500 కోట్లు, వైద్యరంగానికి ఏడాదికి రూ. 11,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రఘునాథపాలెంలో రూ.130 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్ లతో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. భట్టి మాట్లాడుతూ... మెడికల్ కళాశాలకు అనుసంధానంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి వస్తుందన్నారు. నూతనంగా మంజూరైన ఎనిమిది వైద్య కళాశాలలకు అవసరమైన భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అధికశాతం నిధులు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. గత ప్రభుత్వం ఏడాదికి రూ.5,959 కోట్లు ఖర్చు చేస్తే, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.11,482 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.ఐదు లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచినట్టు చెప్పారు. దీంతో 90 లక్షల కుటుంబాలకు లబ్ధి కలిగిందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు వైద్య కళాశాల ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జీలు 200 శాతం పెంచినట్టు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 58 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను మొదటి దఫా మంజూరు చేసి రూ.11,600 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. రైతులకు రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వారి ఖాతా జమ చేశామన్నారు. రైతు భరోసా రూ.12 వేలకు పెంచామని, రూ.12,500 కోట్లతో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇలా... అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలకు సాగునీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తున్నామని, రూ.100 కోట్లు ఖర్చు చేసి రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించి నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణ చేశామని చెప్పారు. 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని,, మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. రూ.తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం కింద స్వయం ఉపాధి

- మిగతా 2 లో

గంగోత్రి యాత్రలో విషాదం

హెలికాప్టర్ కూలి పైలట్ సహా ఆరుగురి దుర్మరణం

ఏపీ నుంచి వెళ్లిన ఇద్దరు: ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్, గంగోత్రికి బయల్దేరిన భక్తుల హెలికాప్టర్ కూలిపోయింది. పైలట్ సహా ఆరుగురు చనిపోయారు. తీవ్ర గాయాలతో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ దుర్ఘటన ఉత్తరకాశి జిల్లాలో గురువారం

- మిగతా 2 లో

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- నాలుగేళ్లలో 20 లక్షలు కట్టించి ఇస్తాం
- భూభారతి... దేశానికే రోల్‌మోడల్: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో-నల్లగొండ : రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదలకు ఇస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇంటిని గురువారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... పూర్తి పారదర్శకంగా ఇల్లు కట్టుకోలేని వారికి మొదటి విడతలో ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పారు. విడతలవారీ అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించినట్టు తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి రూ. ఐదు లక్షల వ్యయంతో ఇళ్లు కట్టించి

- మిగతా 2 లో

ఎదురుకాల్పుల్లో 8 మంది

మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలోని లంకపల్లె అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు భారీగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, మావోయిస్టు ఎస్‌జెడ్‌సీఎం బండి ప్రకాశ్ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. చంద్రన్న తలపై రూ.కోటి రివార్డు ఉంది.

మందుపాతర పేలి ఐదుగురు జవాన్లు...

మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఐదుగురు గ్రేహౌండ్స్ జవాన్లు మృతిచెందిన ఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం తడపాల గుట్టలపై జరిగింది. వివరాల్లోకి వెళ్తే... ములుగు జిల్లాలో గురువారం ఉదయం గ్రేహౌండ్స్ జవాన్లు

- మిగతా 2 లో

లాహోర్‌ను వీడండి: అమెరికా

ఇస్లామాబాద్: లాహోర్‌లో పాక్ మోహరించిన హెచ్‌క్యూ 9 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ రాడార్లను భారత్ ధ్వంసం చేయడంతో అమెరికా ఒక్కసారిగా అప్రమత్తమైంది. తమ దేశ పౌరులు ఎవరైనా ఉంటే తక్షణమే లాహోర్‌ను విడిచి వెళ్లిపోవాలని అడ్వైజరీ జారీ చేసింది. ఈ మేరకు పాక్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నగరంలో పేలుళ్లు, డ్రోన్ల కూల్చివేతలు చోటుచేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొందని పేర్కొంది. తమ సిబ్బందిని షెల్టర్‌లోకి తరలించినట్లు వెల్లడించింది. బుధవారం రాత్రి పాకిస్థాన్ భారత్‌లోని 15 నగరాలు లక్ష్యంగా దాడులు మొదలుపెట్టడంతో భారత్ గగనతల రక్షణ వ్యవస్థలు వాటిని సకాలంలో అడ్డుకొన్నాయి. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. నేటి ఉదయం నుంచి పాకిస్థాన్‌లోని పలు నగరాల్లో వరుసగా పేలుళ్లు చోటు చేసుకొంటుండంతో తీవ్ర గందరగోళం నెలకొంది. యుద్ధ భయంతో పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజి 7 శాతం పతనమైంది. దీంతో ట్రేడింగ్‌ను కొద్దిసేపు ఆపేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 రంగంలోకి దిగింది. నిన్నరాత్రి పాక్ ప్రయోగించిన చాలా ఆయుధాలను ఇది నిర్వీర్యం చేసింది. తాజాగా రావల్పిండిలోని క్రికెట్ మైదానంలో కూడా పేలుడు జరిగినట్లు సమాచారం. ఇక్కడ రాత్రికి జరగాల్సిన పాకిస్థాన్ లీగ్ మ్యాచ్ వాయిదా పడింది. గురువారం మధ్యాహ్నం కరాచీ, గుజ్రాన్‌వాలా, చక్వాల్, అట్టోక్, కరాచీ, ఘోర్, బహవల్పూర్, మినవాలి...తదితర ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. కానీ, వీటిపై భారత ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ వెన్నులో వణుకుపుట్టించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ విరుచుకుపడింది. దీని తర్వాత పాకిస్థాన్ భారత్‌లోని 15 నగరాలపై దాడి చేసేందుకు యత్నించింది. దీనిని ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ అడ్డుకుని పాక్ దాడిని భగ్నం చేసింది. మరోవైపు, కౌంటర్ అటాక్‌గా భారత్... లాహోర్‌లోని పాకిస్థాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ని సర్వనాశనం చేసింది. గురువారం ఉదయం లాహోర్ కంటోన్మెంట్‌కి సమీపంలో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇజ్రాయిల్ తయారీ హార్పి డ్రోన్స్ పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థను నాశనం చేశాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. పాక్ ప్రభుత్వంతో పాటు ఆ దేశ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఏం చేయాలో తెలియక లాహోర్, కరాచీ, సియాల్‌కోట్ విమానాశ్రయాలు మూసేసింది. మరోవైపు, రాజధాని ఇస్లామాబాద్ వ్యాప్తంగా సైరన్లు మోగాయి. దీంతో ఒక్కసారిగా అక్కడి ప్రజల్లో ఆందోళన నెలకొంది.

ఇదిలా ఉంటే, లాహోర్‌ను వెంటనే విడిచి వెళ్లాలని అమెరికా తన ప్రజలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. డ్రోన్ దాడులు ఇందుకు కారణమని తెలుస్తోంది. లాహోర్ ప్రధాన విమానాశ్రయం సమీపంలోని ప్రజల్ని పాక్ అధికారులు ఖాళీ చేయిస్తున్నారనే సమాచారం పాక్‌లోని అమెరికా రాయబార కార్యాలయానికి అందింది. లాహోర్‌లో ఉన్న అమెరికన్లు వెంటనే నగరాన్ని విడిచివెళ్లాలని, సాధ్యం కాకపోతే షెల్టర్‌లో ఉండాలని ఆదేశించింది.

పాక్ దాడుల్ని తిప్పికొట్టాం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ విరుచుకుపడింది. ఆపరేషన్ సిందూర్ పేరిట తొమ్మిది ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. వంద మంది ముష్కరులను మట్టుబెట్టింది. దీంతో భారత్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన పాకిస్తాన్‌ను భారత దళాలు మరోసారి దెబ్బతీశాయి. పాకిస్తాన్ గగనతల రక్షణ వ్యవస్థలు లక్ష్యంగా దాడులు జరిపి లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసం చేశాయి. ఈ మేరకు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉత్తర- పశ్చిమ భారతంలోని 15 ప్రాంతాలు లక్ష్యంగా పాకిస్థాన్ చేపట్టిన డ్రోన్, క్షిపణి దాడులను తిప్పికొట్టినట్లు వెల్లడించాయి. పాక్ లక్షిత ప్రాంతాల్లో అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృతసర్, కపూర్తలా, జలంధర్, లుధియానా, ఆదంపూర్, భటిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, ఉత్తర్‌లై, భుజ్ ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై దాడికి బుధవారం రాత్రి పాక్ యత్నిస్తే ఇండిగ్రేటెడ్ కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ (గ్రిడ్& గగనతల రక్షణ వ్యవస్థ)తో సమర్థంగా తిప్పికొట్టినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను పాకిస్థాన్ ఉపయోగించిట్లు పేర్కొంది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. పాకిస్థాన్‌లో గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలపై దాడుల్లో భాగంగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో భారీ ఫిరంగులతో విరుచుకుపడింది. కాల్పుల్లో 16 మంది పౌరులు మరణించారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఐదుగురు పిల్లలు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే ఫిరంగుల దాడులు, కాల్పులను ఆపేందుకు భారత్ ప్రతి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మరింత ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా తమ దళాలు కచితత్వంతో వ్యవహరిస్తున్నాయని, పాకిస్థాన్ కూడా ఇందుకు కట్టుబడితే శాంతి సాధ్యమని రక్షణ శాఖ వెల్లడించింది.

ఉగ్రవాదం, మతోన్మాదమే శత్రువులు

న్యూఢిల్లీ: ఉగ్రవాదం, మతోన్మాదమే మనకు ప్రధాన శత్రువులని, వీటిపై ఉమ్మడిగా పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. యుద్ధాలతో సమస్యలు పరిష్కారం కాబోవని, దీర్ఘకాల సమాధానాలు కావాలంటే దౌత్యపరంగా, శాంతియుతంగా చర్చలు జరపడం శ్రేయస్కరమని భారత్-పాకిస్థాన్‌కు హితవు పలికింది. సంయమం పాటించాలని, ఉద్రిక్తతలు మరింత పెరగడకుండా నివారించాలని గురువారం ఒక ప్రకటనలో సీపీఐ కార్యదర్శి వర్గం సూచించింది. దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారాలు సాధ్యమవుతాయని, యుద్ధాలతో సమస్యలు పెరుగుతాయని హితవు పలికింది. యుద్ధాలతో దీర్ఘకాల పరిష్కారాలు లభించవని సీపీఐ పేర్కొంది. ప్రస్తుత సవాళ్లభరిత సమయంలో మన ఐక్యత, లౌకికవాదం, ప్రజాస్వామిక స్ఫూర్తి గొప్ప ఆస్తులని వక్కాణించింది. శాంతి, దేశ ఐక్యతకు, అన్ని రకాల విద్వేష-ఉగ్రవాదంపై ఐక్య పోరుకు కట్టుబడి ఉన్నట్లు సీపీఐ ప్రకటించింది. తాజా పరిస్థితికి మతం రంగు పులిమే ప్రయత్నాలు బాధాకరమని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో జాతీయవాదం ముసుగులో మైనారిటీలపై దాడులు ఆక్షేపణీయమని పేర్కొంది. ఇటువంటి చర్యలు దేశ ఐక్యతకు భంగం కలిగిస్తాయని, ఉగ్ర దళాల విభజన అజెండాకు బలం చేకూరుస్తాయని సీపీఐ హెచ్చరించింది. సంఘ విద్రోహ శక్తుల ఆగడాలతో పాటు దేశ ఐక్యతకు భంగం కలిగించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని, వాటి కట్టడికి తగు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఉగ్రవాదంపై పోరులో భాగంగా పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతించింది. సరిహద్దు ప్రాంతాలు ముఖ్యంగా పూంచ్‌లో పౌర మరణాలకు దారితీస్తున్న కాల్పులు, ఫిరంగి దాడులను సీపీఐ తీవ్రంగా ఖండించింది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. అండగా నిలుస్తామని భరోసానిచ్చింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదంపై ఉమ్మడి తీర్మానం, ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష సమావేశానికి ముందుగా పిలుపునిచ్చినది తామేనని గుర్తుచేసింది. సమావేశానికి ప్రధాని వెళ్లకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసింది. ఐదుగురి కంటే తక్కువ ఎంపీలు ఉన్న పార్టీలు సీపీఐ సహా జమ్మూకశ్మీర్, ఈశాన్య పార్టీలు కొన్నింటిని అఖిలపక్షానికి ఆహ్వానించలేదని, లోక్‌సభలో ఒకే ఒక్క ఎంపీ ఉన్న పార్టీని పిలిచారని దుయ్యబట్టింది. దేశ భద్రతపై చర్చల్లో నలుమూలల స్వరాలు కలిస్తే ఐక్యత ప్రతిబింబిస్తుందని సీపీఐ నొక్కిచెప్పింది.

భీకర దాడులు

(మొదటిపేజీ తరువాయి)

పాక్ దుస్సాహసానికి పాల్పడింది. డ్రోన్లు, రాకెట్లు, యుద్ధవిమానాలతో దాడులకు దిగింది. పాక్ ప్రయోగించిన దాదాపు 12 డ్రోన్లు, ఎనిమిది క్షిపణులను ఎస్-400 వ్యవస్థ ద్వారా భారత సాయుధ దళాలు ధ్వంసం చేశాయి. పాక్ ఉపయోగించిన రెండు జేఎఫ్-17, ఒక ఎఫ్-16 యుద్ధ విమానాలను, ప్రొక్రాన్ వద్ద క్షిపణిని పేల్చివేశాయి. అయితే ఆకస్మికంగా జరిగిన దాడితో జమ్మూకశ్మీర్ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రోడ్లపై ఉన్న వారంతా ఆందోళనతో పరుగులు తీశారు. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు. ఆయా ప్రాంతాల గగనతలంలో పాక్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడగా భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. కాగా, పాక్ దాడులతో పఠాన్‌కోట్ ఎయిర్ బేస్ సహా ఏడుచోట్ల భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. దాడుల వేళ జమ్మూకశ్మీర్ పూర్తిగా అంధకారమైంది. జమ్మూ, కుప్వారా, పూంచ్‌లో సైరన్లు మోగాయి. జమ్మూ విమానాశ్రయంపై రాకెట్ దాడిని భారత సైన్యం తిప్పికొట్టింది. శ్రీనగర్ విమానాశ్రయంలో హై అలర్ట్ ప్రకటించారు. సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్ వైమానిక దళం ప్రధాన కార్యాలయాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుంది. జైసల్మేర్ వద్ద డ్రోన్లను భారత సైన్యం గాల్లో పేల్చివేసింది. జమ్మూ వర్సిటీ వద్ద రెండు డ్రోన్లను కూల్చివేసింది. జమ్మూ, కుప్వారా, పఠాన్‌కోట్ సహా పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాలైన జమ్మూ డివిజన్‌లోని సాంబాతో పాటు అఖ్నూర్, రైసీ, రాజౌరీ, కిష్వార్‌లో భారీగా కాల్పులు, ఫిరంగి దాడులు జరిగాయి. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని సైన్యం ఆదేశించింది. సెల్‌ఫోన్ సేవలు నిలిపివేసింది. యూఏవీ (మానవరహిత ఏరియల్ వెహికల్స్)లతో పాక్ దాడి చేస్తుండగా... భద్రతా దళాలు ప్రతిఘటిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అత్యాధునిక సాంకేతికతతో డ్రోన్లను గాల్లో ధ్వంసం చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు అందలేదు. 'జమ్మూ పూర్తిగా అంధకారమైంది. అంతటా భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. బాంబులు, ఫిరంగులు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేస్తోంది. భారత సైన్యం వీటిని సమర్థంగా తిప్పికొట్టగలదు' అని జమ్మూకశ్మీర్ డీజీపీ శేషపాల్ వైద్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'జమ్మూలోని మా ఇళ్ల మీదకు క్షిపణులు దూసుకొస్తున్నాయి. పౌరుల జీవితాలకు ముప్పు ఏర్పడింది. మాకు రక్షణ లేదు. ఇదంతా నిజంగా జరుగుతోంది. జమ్మూ మొత్తం బ్లాకౌట్ అయింది' అంటూ ఓ స్థానికుడు ఎక్స్ మాధ్యమంగా ఫొటోలు, వీడియోలు పంచుకుంటూ భయాందోళనకు గురయ్యాడు.

8 మంది మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

కూంబింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలింది. దీంతో ఐదుగురు గ్రేహౌండ్స్ జవాన్లు మృతిచెందారు. వీరు తెలంగాణ గ్రేహౌండ్స్‌కు చెందిన పోలీసులుగా తెలుస్తోంది. ఈ ఘటనను ములుగు ఎస్పీ ఇంకా ధృవీకరించలేదు. మందుపాతర పేలిన విషయం తెలియడంతో పోలీసులు మరింత అప్రమత్తం అయ్యారు. మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచారు. ఈ ఘటనతో మరోసారి మావోలు తమ ఉనికిని చాటుకున్నారు. కాగా... తెలంగాణ, చత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లోని కర్రెగుట్టల్లో మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పోలీసు బలగాలు భారీగా పాల్గొంటున్నాయి. మావోల ఏరివేత లక్ష్యంగా కేంద్రం చర్యలకు పూనుకుంది. ఫలితంగా ఇటు పోలీసులు, పలువురు మావోలు మృతిచెందారు. కేంద్రం చేపట్టిన చర్యలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతికమిటీతో చర్చలు కూడా జరిపారు. పౌర హక్కుల సంఘాల నేతలు కూడా కేంద్ర నిర్ణయాలను తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరారు. లేకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామని పౌర హక్కుల సంఘాల నేతలు హెచ్చరించారు.

జెత్వానీ కేసులో ఐపీఎస్‌లకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

జెత్వానీని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన విషయం తెలిసిందే. కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు హుటాహుటిన ముంబై వెళ్లి నటి జెత్వానిని విజయవాడకు తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తనకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వానికి ఆమె వివరించింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం... సీఐడీ విచారణకు ఆదేశించింది. ఈ కేసులో విశాల్ గున్ని, క్రాంతి రాణా టాటా పాత్ర ఉన్నట్లు గుర్తించింది. ఈ క్రమంలో ఈ నెల ఐదో తేదీన విచారణకు రావాల్సిందిగా ఇద్దరు ఐపీఎస్ అధికారులకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై ఇరువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు గురువారం ధర్మాసనం ముందు విచారణకు రాగా, వీరిపై తదుపరి చర్యలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసింది.

మసూద్ సోదరుడు అబ్దుల్ రవూఫ్ హతం

(మొదటిపేజీ తరువాయి)

రవూఫ్ అజార్. ఉగ్రశిబిరంపై దాడి సమయంలో అబ్దుల్ రవూఫ్ తీవ్రంగా గాయపడ్డాడని సైన్యం ముందు తెలిపింది. అయితే అతడు చనిపోయినట్లు భారత నిఘా వర్గాలు గురువారం వెల్లడించాయి. రవూఫ్ అజార్ పలు ఉగ్రదాడుల్లో నిందితుడు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో ఇతడు ఉన్నాడు. 2002లో ఉగ్రవాదంపై పరిశోధన చేస్తున్న పెర్ల్ కొంతమంది మతపెద్దలను కలిసేందుకు పాక్‌లోని కరాచీకి వెళ్లాడు. కాందహార్ హైజాక్ సందర్భంగా ఉగ్రవాదులు విడిపించిన ఒమర్ షేక్ ఓ హోటల్ నుంచి పెర్ల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. 1999లో జరిగిన ఐసీ814 విమాన హైజాక్‌లో రవూఫ్ అజార్ హస్తం ఉంది. ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాంధహార్‌కు చేర్చారు. అక్కడి నుంచి భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి... భారత జైళ్లలో ఉన్న మసూద్ అజార్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్ అనే ఉగ్రవాదులను విడిపించుకొని తీసుకెళ్లారు.

గంగోత్రి యాత్రలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. ఎయిరో ట్రాన్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (వీటీ-ఓఎక్స్ఎఫ్) సంస్థ నడిపే హెలికాప్టర్... డెహ్రాడూన్‌లోని సహస్త్రధార హెలిప్యాడ్ నుంచి ఖర్సాలీ హెలిపాడ్‌కు బయల్దేరింది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ప్రమాదానికి గురైంది. రిషికేశ్-గంగోత్రి జాతీయ రహదారి వద్ద ఉదయం 8.45 గంటలప్పుడు కూలిన హెలికాప్టర్ 200-250 మీటర్ల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ మేరకు సహాయక చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్ఎఫ్ తెలిపింది. ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించినట్లు జిల్లా మెజిస్ట్రేట్ మెహర్బాన్ సింగ్ బిస్త్ తెలిపారు. భక్తుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం.భాస్కర్ (51) తీవ్రంగా గాయపడగా, ఆయనను ఎయిర్ లిఫ్ట్ చేసి రిషికేశ్ ఎయిమ్స్‌లో చేర్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన మరొకరు మృతిచెందారు. మృతులను ముంబైకు చెందిన కళా చంద్రకాంత్ సోని (61), విజయ రెడ్డి (57), రుచి అగర్వాల్ (56), యూపీకి చెందిన రాధా అగర్వాల్ (79) ఏపీకి చెందిన వేదవతి కుమారి (48), గుజరాత్‌కు చెందిన కెప్టెన్ రాబిన్ సింగ్ (60)గా గుర్తించారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దర్యాప్తునకు ఆదేశించారు. గాయపడిన వారికి అవసరమైన సహాయం అందించాలన్నారు. అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై విమాన దుర్ఘటనల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) విచారణ చేపడుతుందని అధికారులు వెల్లడించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వివరించారు. గిరిజన కుటుంబాలకు రూ.12,500 కోట్లతో ఇందిరా గిరిజన వికాసం పథకం కింద ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సోలార్ పంప్‌సెట్లు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లను అందిస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా... ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాజనర్సింహ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు ఆరు పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ప్రజల ప్రయోజనార్థం ఇక్కడే రూ.4,100 కోటతో రీజనల్ క్యాన్సర్ సెంటర్, ప్రతి జిల్లాకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. నూతనంగా 213 అంబులెన్స్ ప్రారంభించినట్టు చెప్పారు. ఖమ్మంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో జాతీయ, స్టేట్ రహదారులపై సుమారు 90 ట్రామా సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నామని, బ్లాక్ స్పాట్ వద్ద ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నామని వివరించారు. వైద్య శాఖలో సుమారు ఎనిమిది వేల పోస్టులను భర్తీ చేశామని అన్నారు. తుమ్మల మాట్లాడుతూ... అమరావతి -నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కనే వైద్య కళాశాలనిర్మాణం ఏడాది కాలంలో పూర్తిచేసి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. పొంగులేటి మాట్లాడుతూ... గత ప్రభుత్వ రూ.వెయ్యి కోట్ల బకాయిలను చెల్లిస్తూ వైద్య శాఖలో నూతన ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ... పేద రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఇక్కడ సేకరించిన భూములకు ప్రత్యామ్నాయంగా మరో చోట భూ కేటాయించామన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీ ఎంఐడీసీ ఎండి ఫణిందర్ రెడ్డి, ఖమ్మం నగర మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జెడ్పి సీఈవో దీక్షా రైనా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, ఆర్ అండ్ బీ ఎస్ఈ యాకుబ్ పాల్గొన్నారు.

లాలు విచారణకు రాష్ట్రపతి అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

పెట్టింది. చార్జిషీటు దాఖలు చేసింది. కేంద్ర రైల్వేమంత్రిగా 2004-09లో గ్రూప్ డీ నియామకాల క్రమంలో లాలు అవినీతికి పాల్పడ్డారన్న సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. ఉద్యోగానికి బదులుగా పొందిన స్థలాలు లాలు కుటుంబ సభ్యుల పేర్ల మీద ప్రత్యక్షంగా లేక పరోక్షంగా నమోదైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో సీబీఐ మూడు చార్జిషీట్లు దాఖలు చేసింది.

నూకలు చెల్లినట్లే

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి... మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే... ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. జాతీయ జెండాలు చేతబూని ర్యాలీగా ముందుకు సాగారు. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ ర్యాలీలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ విజయశాంతి, సచివాలయ ఉద్యోగులు, మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తామన్నారు. భూ సమస్యలను తీర్చే భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్ కానుందని అన్నారు. జూన్ రెండో తేదీ నుంచి ప్రతి గ్రామానికి తహసిల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. తొమ్మిది లక్షల ఇరవైఆరువేల సాదా బైనమాల దరఖాస్తులను పరిశీలించి పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. నకిరేకల్ మండలాన్ని పైలెట్ మండలం గా తీసుకున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం తమ స్వార్థం కోసం తాపత్రయపడడం తప్ప పేదవాడికి ఉపయోగపడే పని చేయలేదని విమర్శించారు. 45 శాతం ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్లు రావటం లేదని, తాము అధికారంలోకి వచ్చాక రూ.650 కోట్లు ఖర్చు చేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి తాగు నీటిని అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష పదివేల కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే కూలిపోయిందని అన్నారు. ఒక్కొక్కరికి ఆరు కేజీలు చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేపట్టిందని, అందులో ఒకటి భూ భారతి ,మరొకటి ఇందిరమ్మ ఇళ్లు అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసి రెండు వందల ఇళ్లకు ఒక గెజిటెడ్ అధికారిని ఏర్పాటు చేసి సర్వే నిర్వహించిన తర్వాత జాబితా రూపొందించామన్నారు. ఇంచార్జి మంత్రి ఆమోదంతో ఇందిరమ్మ ఇళ్లు అత్యంత పేదవాడికి ఇస్తున్నట్టు చెప్పారు. ఇందిరమ్మ బిల్లుల చెల్లింపులో ఎవరు అపోహ పడవద్దన్నారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ... గతంలో ఎస్ఎల్‌బీసీ కోసం తీసుకున్న భూముల సమస్యను పరిష్కరించాలని, ఇనుపాములలో ఒకే వ్యక్తిపై 50 నుంచి 100 ఎకరాలు లెక్కించడం జరిగిందని, దానిని సరిచేయాలని కోరారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, సత్యం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, అమిత్ రెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

హైడ్రా ఆక్రమణలు ఉపేక్షించదు

(మొదటిపేజీ తరువాయి)

పునరుద్ధరించుకోవాలన్న ఆలోచనతోనే హైడ్రాను తీసుకొచ్చామని చెప్పారు. బెంగుళూరులో చెరువులను పరిరక్షించుకోకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముంబై, చెన్నై వరదలతో సతమతమవుతున్న పరిస్థితి కళ్లముందు కనిపిస్తోందని, కాలుష్యాన్ని నియంత్రికపోవడంతో దిల్లీలో పార్లమెంట్ నుంచి పాఠశాల వరకు సెలవులు ప్రకటిస్తున్నారని, మెట్రో నగరాలు నివాస యోగ్యం కాని నగరాలుగా మారుతున్నాయన్నారు. ప్రకృతిని కాపాడుకోకపోతే హైదరాబాద్ లోనూ ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని, అందుకే ఎవరేం అనుకున్నా హైడ్రాను తీసుకొచ్చామన్నారు. చెరువులు ఆక్రమిస్తే ఎంతటివారినైనా హైడ్రా ఉపేక్షించదన్నారు. హైదరాబాద్ లో చిన్న వర్షం వస్తే కాలనీలకు కాలనీలే మునిగిపోతున్నాయని, హైడ్రా అంటే కేవలం కూల్చివేతలే కాదని, రోడ్డుపై నీరు నిలవకుండా, విద్యుత్ పునరుద్ధరణ జరిగేలా, ట్రాఫిక్ స్ట్రీమ్ లైన్ చేసే బాధ్యతను హైడ్రా చూసుకుంటోందని వివరించారు. నగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురయ్యాయని, కొందరు రోడ్లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉన్నందునే హైడ్రా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకోసం మేం వెనక్కి తగ్గేది లేదన్నారు. పునరుద్ధరించుకుంటామంటే కొందరికి బాధైతుందని, ప్రకృతిని కాపాడుతామంటే కొందరికి దుఃఖం వస్తుందని, ఆక్రమణలు తొలగిస్తుంటే రియల్ ఎస్టేట్ పడిపోతుందని మాట్లాడుతున్నారని, ప్రజలకు మేలు జరగొద్దని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ లో సబర్మతి, యూపీలో గంగానది, ఢిల్లీలో యమునా నదిని వాళ్లు ప్రక్షాళన చేసుకుంటున్నారని, కానీ మేం మూసీని పునరుద్ధరణ చేస్తామంటే అడ్డుకుంటున్నారని రేవంత్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు చేస్తే కరెక్టు... తెలంగాణలో కాంగ్రెస్ చేస్తే తప్పా అని ప్రశ్నించారు. నాపై కక్ష ఉంటే నాపైనే చూపండని, ప్రజలకు మేలు జరిగే పనులను అడ్డుకోవద్దన్నారు. వారసత్వ సంపదను కాపాడుకుని నగరాన్ని పునరుద్ధరించుకుందామన్నారు. హైడ్రా అధికారులకు నా సూచన పేదల పట్ల మానవీయ కోణంతో, సానుభూతితో వ్యవహరించండన్నారు. పేదలకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకురండని సూచించారు. పెద్దల పట్ల కఠినంగా వ్యవహరించండని ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోం రవి గుప్తా, మేయర్ జి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీ లతా రెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఇలంబర్తి, హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్, హైడ్రా, రెవిన్యూ, ఇరిగేషన్, విద్యుత్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

100 మంది ఉగ్రవాదులు హతం

(మొదటిపేజీ తరువాయి)

సిందూర్ కొనసాగుతోందని స్పష్టంచేశారు. పాకిస్థాన్ రెచ్చగొడితే వెనక్కు తగ్గేదేలేదన్నారు. ఆపరేషన్ దృష్ట్యా విశ్వసనీయ సమాచారాన్ని పంచుకోలేమని, అన్ని వివరాలు వెల్లడించలేమని ప్రతిపక్ష నేతలతో ఆయనన్నారు. భారత్ లక్షిత దాడులకు బదులివ్వాలని పాకిస్థాన్ యత్నిస్తే... వాటిని తిప్పికొడతామని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి కేంద్రప్రభుత్వం రెండుసార్లు అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. తాజా సమావేశంలో ఆపరేషన్ సిందూర్ వివరాలను రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు జరిపి 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఆపరేషన్ పూర్తి వివరాలు ఇప్పుడే వెల్లడించలేమన్నారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెంచే ఉద్దేశం లేదని చెప్పారు. పాక్ రెచ్చగొడితే ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరెన్ రిజిజు విలేకరులతో మాట్లాడుతూ తాజా చర్యలపై రాజకీయ ఏకాభిప్రాయం కోసమే అఖిలపక్షాన్ని పిలిచినట్లు తెలిపారు. నాయకులంతా పరిపక్వతతో వ్యవహరించారని, వాదనలకు దిగలేదని అన్నారు. దేశ భద్రత, పౌరుల భద్రత ముఖ్యంగా సరిహద్దుల పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారని, కొన్ని సలహాలు, సూచనలు అందించారని రిజిజు చెప్పారు. ఉగ్రవాదంపై పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రతి ఒక్కరు స్వాగతించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ వివరాలు, ప్రభుత్వ ఉద్దేశాలను ప్రతిపక్ష నేతలకు రక్షణ మంత్రి వివరించారు. కానీ సాంకేతికపరమైన అంశాలను వెల్లడించలేదని రిజిజు అన్నారు. ఉగ్రవాద వ్యతిరేక చర్యలపై ప్రభుత్వానికి ప్రతిపక్షాలు సంపూర్ణ మద్దతు తెలిపాయన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయాలకు తావులేదని చెప్పారు. రాజకీయం అన్నది కేవలం ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకే కాదు... జాతి నిర్మాణానికీ అవసరమన్నారు. 'ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. సాయుధ దళాధిపతులంతా బిజీగా ఉన్నారు. అందుకే వారెవరూ సమావేశానికి రాలేదు' అని ఓ ప్రశ్నకు రిజుజు బదులిచ్చారు.

ఐక్యంగా నిలబడుతాం: రాహుల్, ఖడ్గే

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దేశం కోసం కేంద్రం తీసుకునే చర్యలకు అండగా నిలుస్తామన్నారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, కొన్ని వివరాలు వెల్లడించలేమని కేంద్రం చెప్పిందని అన్నారు. మంచి సందేశం ఇచ్చేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరినట్లు రాహుల్ గాంధీ చెప్పారు. అఖిలపక్షానికి ప్రధాని మోదీ గైర్హాజరు కావడంపై ఖడ్గే అసంతృప్తి వ్యక్తంచేశారు. 'జవాన్ల శౌర్యానికి సెల్యూట్ చేస్తున్నాం. ప్రధాని కూడా సమావేశానికి వచ్చి ఉగ్రవాద వ్యతిరేక చర్యలపై మాట్లాడితే బాగుండేది. ఆయన గత సమావేశానికి కూడా రాలేదు' అని ఖడ్గే అన్నారు. ఇండియా ఐక్య సంఘటన, ఇతర పార్టీలన్నీ ముక్తకంఠంతో కేంద్రానికి మద్దతు ప్రకటించాయని, ఉగ్రవాదంపై పోరులో భాగంగా కేంద్రం చర్యలపై ఐక్యంగా ఉన్నాయని ఖడ్గే వెల్లడించారు. సైన్యానికి సర్వాధికారం ఇచ్చినట్లు ప్రధాని చెప్పారని గుర్తుచేశారు. 'ఇది సున్నిత సమయమని, అన్ని వివరాలు వెల్లడించలేమని రాజ్‌నాథ్ చెప్పారు. సమావేశంలో సరిహద్దు ప్రాంత ప్రజల భద్రతపై ప్రతిపక్ష నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. కాల్పుల మధ్య జీవిస్తున్న జమ్మూకశ్మీర్ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు తగు చర్యలు తీసుకుంటామని సర్కారు భరోసా ఇచ్చింది. పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. చట్టసభ జరిగితే ఎంపీలు తమ అభిప్రాయాలు వెల్లడించగలరు. తద్వారా ప్రజలకు హామీ లభిస్తుంది. అయితే ప్రభుత్వం స్పందించలేదు' అని ఖడ్గే వెల్లడించారు.

ఉగ్రమూకలకు సరైన సమాధానం ఆపరేషన్ సింధూర్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : మతం ముసుగులో ఆడబిడ్డల సింధూరాన్ని తుడిచిన పాకిస్తాన్ ఉగ్రమూకలకు భారత సైన్యం సరైన రీతిలో ఆపరేషన్ సింధూర్ పేరుతో సరైన జవాబు చెప్పిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం అయన నల్గొండ జిల్లా, నకిరేకల్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు భారత సైన్యానికి మద్దతుగా నిర్వహించిన సంఘీభావ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత సైన్యానికి మద్దతుగా నకరికల్‌లో ర్యాలీ నిర్వహించడం సంతోషమని అన్నారు. పహల్గాం దాడి అమానుషమని, మతాన్ని అడ్డం పెట్టుకుని ఉగ్రవాదులు మన ఆడబిడ్డల సింధూరాన్ని తుడిచివేశారని, అలాంటి పాకిస్తాన్ మూకలకు గత వారం రోజుల్లో ఆలోచించి ఆపరేషన్ సింధూర్ పేరుతో దాడులు జరిపి కాశ్మీర్ దాడిలో పాల్గొన్న ఉగ్రమూకలందరికి బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర పక్షాన భారత సైన్యానికి మద్దతుగా ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ అన్ని రకాల సహాయ సహకారాలను సైన్యానికి అందిస్తుందని, అలాగే కేంద్రానికి ఈ విషయంలో తోడుగా నిలుస్తుందని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఇంచార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

యుడైస్ పోర్టల్లో ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థుల పేర్లు నమోదు చెయ్యాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థులు యుడైస్ పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు కావాల్సివుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతంలో బాలికల కంటే బాలురు వెనుకబడి ఉండటానికి గల కారణాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఇంటర్మీడియట్‌లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్, ఫేషియల్ అటెండెన్స్ ప్రవేశ పెట్టేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణం జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే అన్ని కళాశాలల్లో ఎకరాకి ఐదు ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలలో పరీక్షకు హాజరైన సంఖ్యకు, యుడైస్ ప్లస్ పోర్టల్లో నమోదుకు చాలా తేడాలు ఉన్నాయన్నారు. ఈ తేడాలున్న కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను పిలిపించి జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడే విద్యార్థులందరినీ యుడైస్ ప్లస్ పోర్టల్ లో నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర చారి, కోఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మరో అవినీతి కాళేశ్వరంలా సీతారామ నీటి ప్రాజెక్టు

విశాలాంధ్ర - గార్ల : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోఒక దశాబ్దాకాలంగా నిర్మిస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అవినీతి అక్రమాల్లో మరో కాళేశ్వరం ప్రాజెక్టుల మారిందని తెలంగాణ విద్యావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వజంపాల ఆరోపించారు. ఈ ప్రాజెక్టును రీ డిజైన్, రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో ఇష్ట రాజ్యాంగ నిర్మిస్తున్నారని విమర్శించారు. గురువారం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో గార్ల లొ సీతారామ ప్రాజెక్టుపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో విశ్వ జంపాల ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్ మొదటి నిర్దేశిత ప్రాంతాలైనా ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజక వర్గ ప్రాంతాలకు నీళ్ళు ఇవ్వాల్సి ఉందన్నారు. పనుల్లో నాణ్యత లోపించడమే గాక ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాలను విస్మరించడం జరిగిందన్నారు. పనులు మొదలైన 9 ఏళ్ళ కాలంలో రూ.10 వేల కోట్ల ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదంటే ప్రపంచంలోనే వింతైన ప్రాజెక్టుగా దీనికి గుర్తింపు వచ్చిందన్నారు. ప్రాజెక్ట్ ద్వారా జలసాధన కోసం బహుముఖ పోరాటాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 10న గార్ల మండల కేంద్రంలో జలసాధన కమిటీని అన్ని వర్గాలతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, కందునూరి ఈశ్వర్ లింగం, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుగులోత్ సక్రు, టిఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, పానుగంటి రాధాకృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకటరెడ్డి, టిడిపి నాయకులు రంగరాజు, శివాజీ, కత్తి సత్యం బహుజన వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, గిరిజన సంఘం నుంచి హరినాయక్ పాల్గొన్నారు.

నూతన జిల్లా న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో నూతన జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీవాణిని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మర్యాదపూర్వ కంగా కలిసి పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. కలెక్టర్ ను జడ్జి సాదరంగా ఆహ్వానించారు. పూల మొక్కతో వచ్చిన కలెక్టర్‌ను సాధారణంగా ఆహ్వానించి న్యాయమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రిసెప్షన్, హెల్ప్ డెస్క్, ఓల్డేజ్ క్లినిక్, ఐసియూ వార్డు, ఫార్మా విభాగం, ఫిమేల్ వార్డు, ల్యాబ్ లను డిప్యూటీ సీఎం, మంత్రుల బృందం పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల విషయమై ఏర్పాటు చేసిన బోర్డును పరిశీలించారు. రోగులకు అవసరమైన మందుల స్టాక్ అందుబాటులో ఉన్నాయా, ఎమర్జెన్సీ మందుల స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సేవలు ఏ విధంగా ఉన్నాయి, పూర్తి స్థాయిలో మందులు ఇస్తున్నారా, ప్రైవేట్‌కు ఏమైనా రాస్తున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రతిరోజు ఔట్ పేషెంట్ సంఖ్య ఎంత ఉంటుంది, ఏ రకమైన వ్యాధిగ్రస్తులు అధికంగా వస్తున్నారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న ఆహార నాణ్యతను మంత్రులు పరిశీలించారు. ల్యాబ్‌లలో ఎన్ని పరీక్షలు జరుగుతున్నాయి, ఫలితాలు ఇవ్వడానికి ఎంత సమయం పడుతుంది ఆరా తీశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేయుచున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమ వేతనాలు రెగ్యులర్‌గా అందేలా చర్యలు చేపట్టాలని, సేవలను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ, వైద్య ఆరోగ్య శాఖామంత్రులకు వినతిపత్రం అందజేశారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్‌లు డాక్టర్ పి.శ్రీజ, వైద్య శాఖ సంచాలకులు డా. నరేంద్ర కుమార్, టిజి ఎంఐడిసి ఎండి ఫణిందర్ రెడ్డి, ఇఇ ఉమామహేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ములుగు ప్రభుత్వాసుపత్రికి పరికరాలు అందచేత : కలెక్టర్

విశాలాంధ్ర - బ్యూరో ములుగు జిల్లా : సిఎస్ఆర్‌లో భాగంగా ఇసిఐఎల్ హైదరాబాద్ సంస్థ ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి 20 లక్షల విలువ గల ఎముకల విభాగానికి చెందిన ఆపరేషన్ సిఆర్మ్ మెషిన్, ఓట్ లైట్, ఫ్రాక్చర్ టేబుల్‌లను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇసిఐఎల్ హైదరాబాద్ సంస్థను అభినందించారు. భవిష్యత్తులో ఆసుపత్రికి ఉపయోగపడే ఇటువంటి మంచి పనులు చేయడానికి ముందుకు రావాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగదీష్, ఇసిఐఎల్ ప్రతినిధులు సి.మురలిధర్, ఈడి (ఏపీ, ఎస్డి, ఈఎస్‌డి, హెచ్ఆర్), సుధన్షు కుమార్, ఎడ్ (ఫైనాన్స్), రంజన్ శ్రీవాస్తవ, ఏజియం (ఫైనాన్స్) డాక్టర్ పి.వేణుబాబు, సీఎంఓ, ఎస్డిజియం, ఎ.రామకృష్ణ, డి షిరిషా, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి, ఎం.కుమార్, యూనియన్ ప్రతినిధి ఎ.సాంబమూర్తి, కార్పొరేట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిపార్టెంట్, డాక్టర్లు డాక్టర్లు, వినయ్, శాంతి, బిక్షపతి, బింగి, ప్రవీణ్ రెడ్డి, నరేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఉపాధి హామీ నూతన వార్షిక ఏడాది ప్రారంభమైంది. కూలీలకు అధికం గా పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా అధికా రులు ప్రణాళికలు రూపొందించారు. వేసవిలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతో కూలీలకు ఊరట లభిస్తోంది. వ్యవసాయ పనులు తక్కువగా ఉండే వేసవిలో కూలీలకు పని కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి కనీసం వందరోజుల పాటు పని కల్పిస్తున్నారు. వాననీటి వృథాను అరికట్టి భూగర్భ జలాలను పెంచేందుకు నీటి కుంటల నిర్మాణం చేపడుతు న్నారు. రోజుకు కనీసం దినసరి కూలీ లభించేలా అవగాహన కల్పిస్తున్నారు. నేరేడు చర్ల మండలంలో రెండు నూతన గ్రామాల కలుపుకొని 19 గ్రామాలు న్నాయి. మండలంలో మొత్తం 8328 జాబ్ కార్డులు ఉండగా ఉపాధి కూలీలు ఉండగా 19910 మంది కూలీలు పంట పొలాలకు ఉన్న జాంట్ కాలువల పూడిక పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామాల్లో కాల్వల పూడికతీత, భూమి చదును, కందకాలు, పశువుల పాకలు, గొర్రెల పాకల నిర్మాణం చేపడుతున్నారు. నిర్ణీత కొలతల ప్రకారం పనిచేసి కనీస వేతనం పొందాలని అవగాహన కల్పిస్తున్నారు. ఏపీఓ శేఖర్ మాట్లాడుతూ సంవత్సరానికి ఒక కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పిస్తున్నా మన్నారు. కూలీలకు వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడు తున్నాంఅని అన్నారు.నీడలేనిచోట నీడ సౌకర్యం కల్పిస్తున్నాం. గ్రామీణప్రాంత ప్రజలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.

అవగాహనతోనే తలసేమియా నివారణ సాధ్యం

విశాలాంధ్ర - మరిపెడ : తలసేమియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉన్నప్పుడే ఆ వ్యాధిని నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవి ఆధ్వర్యంలో మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ఎర్రరక్త కణాలలో ఉండే హిమోగ్లోబిన్ ను శరీరం తగినంతగా ఉత్పత్తి చేయనప్పుడు ఏర్పడే రక్త వ్యాధినే తలసేమియా అంటారని అన్నారు. హిమోగ్లోబిన్ రక్తంలోని ఆక్సిజన్‌ను శరీరంలోని వివిధ భాగాలకు తీసుకువెళ్లడంలో కీలక పాత్రపోషిస్తుందన్నారు. ఇది ఆల్ఫా, బీటా అనే రెండు ప్రొటీన్లతో ఏర్పడుతుందన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల్లో ఎముక మజ్జ (బోన్ మ్యారో) శరీరానికి కావాల్సిన హిమోగ్లోబిన్ లేదా ఎర్ర రక్త కణాలను తయారు చేయలేకపోవడంతో శరీరంలోని అన్ని కణాలకు తగినంత ఆక్సిజన్ సరఫరా కాదన్నారు. మన శరీరంలో ఎర్ర రక్త కణాలు లేదా హిమోగ్లోబిన్ ఉండాల్సిన మోతాదులో లేనప్పుడు తలసేమియాతో పాటు రక్తహీనత సమస్య కూడా కలిగే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ స్వామి, సాయిశ్రీ, సిరి, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, సూపర్వైజర్లు కృష్ణ, ఆచార్యులు, ఏఎన్ఎంలు సరళ, నర్సబాయి, ఝాన్సీ, శ్రీదేవి, నాగమణి, ఆశా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

20న సింగరేణిలో సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20న కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో కూడా జయప్రదం చేయాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని భాస్కరరావు భవనంలో సంయుక్తంగా నిర్వహించిన విలేఖరుల సమావేశంలో కె.రాజకుమార్, ఏఐటీయూసి, టి.రాజిరెడ్డి, సిఐటీయు, రాజేందర్, ఐఎన్టీయుసి, ఎం.రాంమూర్తి, టీబీజీకేఎస్‌లు మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా తయారు చేస్తూ యాజమాన్యా నికి అనుకూలంగా తీసుకువచ్చిన ఈ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని అందుకే దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలో కార్మిక సంఘాలు సమైక్యంగా సమ్మె పిలుపునిచ్చాయన్నారు. దేశవ్యాప్త సమస్యతో పాటు సింగరేణికి సంబంధించిన బొగ్గును ప్రైవేట్ కాంట్రాక్టర్ల ద్వారా వెలికితీసే ప్రయత్నాలను యాజమాన్యం విరమించు కోవాలని, పెరుప్రైన యాజమాన్యమే ఇన్ కంటాక్సు చెల్లించాలని, మరికొన్ని డిమాండ్లు సమ్మె నోటీసులో పెట్టామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎల్.ప్రకాశ్, మడ్డి ఎల్లయ్య, అన్నారావు, కె. స్వామి, జిగురు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన యాకూబ్ పాషా

విశాలాంధ్ర - గూడూరు: తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సతీమణి మాధురి రెడ్డిలకు గురువారం రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండి యాకూబ్ పాషా మర్యాద పూర్వకంగా కలిసి పెళ్లి రోజు శుభా కాంక్షలు తెలిపారు. అలాగే ఇందిరమ్మ గృహ నిర్మాణంలో పేద బడుగు బలహీన వర్గాల అందరికీ ఇండ్లు అందేలా చూడాలని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి యాకూబ్ పాషా తెలియజేసినట్లు తెలిపారు. గూడూరు మండలంలో ఇండ్లు లేని వారు అధిక మొత్తంలో ఉన్నారు. కాబట్టి ప్రత్యేక చొరవ చూపించి గూడూరు మండలానికి ఇండ్లు ఇవ్వాలని, ఎండి యాకుబ్ పాషా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలియపరిచారు.

ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ నిర్మించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి టాయిలెట్స్ నిర్మించాలనీ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మిషన్ భగీరథ, విద్య, వైద్య ఆరోగ్య,మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తప్పని సరిగా టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. టాయిలెట్స్ నిర్మాణాలు ఒక నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు 40 మంది అబ్బాయిలకు ఒక టాయిలెట్, 30 అమ్మాయిలకు ఒకటి టాయిలెట్ లెక్కన విద్యార్థుల సంఖ్య ప్రకారం నిర్మించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో వంట గది, ప్రహరీ గోడ నిర్మాణం చేయాలన్నారు. గ్రామాల్లో సీసి రోడ్స్ పూర్తి చేయాలి. గురుకుల పాఠశాల, కళాశాలలో వాటర్ ట్యాంక్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గురుకుల విద్యా సంస్థలకు, అంగన్వాడి కేంద్రాలకు మిషన్ భగీరథ నీరు తప్పని సరిగా సరఫరా చేయాలన్నారు. త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని, మౌలిక వసతులు సదుపాయాలు కల్పించాలన్నారు. వివిధ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అధికారులు పాఠశాలకు వచ్చినపుడు స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల భవనాలు నిర్మించాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీసీఈవో జానకి రెడ్డి పంచాయతీ అధికారి సాయి బాబా, పిడి డిఆర్డిఏ జ్యోతి వైద్య అధికారినీ గాయత్రి దేవి, ఏఈడిఈలు సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం దేశానికి పెను ప్రమాదం : కూనంనేని

విశాలాంధ్ర - ఖమ్మం : ఉగ్రవాదం దేశానికి ప్రమాదమని అది ఏ రూపంలో ఉన్న ఉగ్రవాదాన్ని తుద ముట్టించాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉగ్రవాదంపై పోరుకు భారత కమ్యూనిస్టు పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే కాకుండా కవ్వింపు చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాల్లో భాగంగా గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడి లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుందన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడిచిన రెండు దశాబ్దాలలో సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగగా దారిద్ర్యరేఖకు దిగువన జీవించే వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ వచ్చిందన్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ సాయుధ తెలంగాణ పోరాటంలోనూ భారత కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పాత్ర పోషించిం దని నాటి పోరాట ఘట్టాలను నేటి తరాలకు తెలియజేసేందుకు శత వసంత సభలను నిర్వహిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేకుంటే హక్కులు సాధించ బడేవి కావని యువజన విద్యార్థి కార్మిక, కర్షక, మహిళా హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందన్నారు. సమాజాన్ని మార్చేది, మార్చగలిగేది ఎర్ర జెండా మాత్రమే నని కూనంనేని తెలిపారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేంద రెడ్డి, ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లు, అజ్మీర రామ్మూర్తి, పగడాల మల్లేష్, నాయకులు వరద నర్సింహా రావు, బాగం ప్రసాద్, వెంకయ్య, బానోత్ రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : అక్రమంగా తరలిస్తున్న రూ. 2.75 లక్షల విలువ చేసే గంజాయిని పక్క సమాచారంతో అశ్వరావుపేట పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఐదున్నర కిలోల గంజాయిని ఏడుగురు వ్యక్తులు మూడు మోటారు సైకిళ్లపై ఊట్లపల్లి వైపు నుండి అశ్వారావుపేట వైపుకి వస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. భద్రాచలం రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు కట్టుబడ్డారు. వీరి వద్ద నుండి 5.5 కేజీల గంజాయి, 6 సెల్ఫోన్లు, 3 మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో అశ్వరావుపేటకు చెందిన వ్యాపారి షేక్ ఫిరోజ్ ఖాన్, గండికోట ప్రభు కుమార్, పసుపులేటి గోపీచంద్ అలియాస్ శ్రీను, జంగారెడ్డిగూడెం కు చెందిన పుట్టా జగదీష్, ఆవుల సుధీర్ రెడ్డి, తిరువీధుల కార్తీక్, హైదరాబాద్ కు చెందిన బల్లా సంజయ్ లు వున్నారు. గంజాయి వ్యాపారి, సప్లయర్ రాము, మరికొంత మంది వినియోగదారులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టునకు తరలించినట్లు అశ్వారావుపేట సిఐ పి.నాగరాజు తెలిపారు. ఎస్సై టి.యాయతి రాజు, హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర రావు, కానిస్టేబుళ్ళు హరిబాబు, కృష్ణ ప్రసాద్, రమేష్ రావు, రామకృష్ణ, నరేష్ బాబు భానుచందర్, వెంకటేశ్వరరావు, సంతోష్ లు స్మగ్లర్లను పట్టుకున్నారు.

ఇల్లందులో సన్న బియ్యం అక్రమ దందా

విశాలాంధ్ర - ఇల్లందు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పేదలకు అందిస్తున్న సన్న బియ్యం పథకం పక్కదారి పట్టడం మొదలైంది. సన్న బియ్యం అక్రమంగా తరలించినా లేక లబ్ధిదారులు బయిటికి వ్యక్తులకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టంగా హెచ్చరికలు చేసిన ఫలితం కనిపించడం లేదు. గురువారం ఇల్లందులోని ఒక రేషన్ షాపు నుంచి ప్యాసింజర్ ఆటోలో బియ్యం అక్రమంగా తరలిస్తున్న క్రమంలో స్థానిక యువకులిద్దరు ప్రత్యక్షంగా అడ్డుకున్నారు. ఒక ప్యాసింజర్ ఆటోలో పట్టపగలే ఒక రేషన్ షాప్ నుంచి సుమారు 5 క్వింటాళ్ల సన్న బియ్యం తరలిస్తున్న ఆటోను నిలువరించారు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు ఈ బియ్యన్ని కోటి అనే వ్యక్తి తరలిస్తున్నట్లు తెలిసింది. కాగా ఆటోను నిలుపుదల చేసిన యువకులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆటో డ్రైవర్ తోపాటు వెంట ఉన్న మరో వ్యక్తి పట్టుకున్న యువకులపై బెదిరింపులు చేస్తూ దౌర్జనంగా అక్కడ నుంచి వేగంగా ఆటోతో పారిపోయారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సరికి కొంత ఆలస్యమైంది. ఆటో నెంబర్ తోపాటు బియ్యం ఎక్కడ నుంచి తరలిస్తున్నారో వివరాలను పోలీసులు యువకుల నుంచి సేకరించారు. దశాబ్దాల నుంచి రేషన్ బియ్యం అక్రమాలతో అడ్డగోలుగా సంపాదించిన అక్రమార్కులు, మిల్లర్లు మాత్రం తమ అలవాటు మానుకోలేకపోతున్నారని ఇల్లందు ఘటన రుజువు చేస్తుంది. కొందరు అధికారుల అండదండతోనే ఈ వ్యాపారం మళ్ళీ పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై రెవెన్యూ సివిల్ సప్లై డిటి యాకూబ్ పాషాను విశాలాంధ్ర వివరణ కోరడం జరిగింది. పోలీసుల సహకారంతో దాడులను ఉధృతం చేస్తామన్నారు. తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి రేషన్ షాపుల రికార్డుల్లో తేడా వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తాను విధుల్లో చేరిన రెండు నెలల వ్యవధిలోనే రేషన్ బియ్యం అక్రమాలపై 8 కేసులు నమోదు చేసినట్లు డిటి చెప్పారు.

బంగారం చోరీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : మాటలతో మభ్యపెట్టి మంచినీళ్లు ఇమ్మంటూ కళ్ళల్లో కారం కొట్టి చాకచక్యంగా రెండు తులాల పుస్తెలతాడు బలవంతంగా తీసుకువెళ్లిన సంఘటన నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ గ్రంథాలయం బజార్లో నివసిస్తున్న మూగ వ్యక్తి గుండా నరసింహారావు స్థానిక వెంకట్రామ సినిమా థియేటర్ వాల్ పోస్టర్లు అంటించే పని చేస్తాడు. అతని భార్య వికలాంగు వృద్ధురాలు గుండా చంద్రకళ (60) ఇంటిదగ్గర ఉన్న సమయంలో తెలిపిన ఒక ఆమె ఇంట్లోకి వచ్చి మంచినీళ్లు కావాలని అడగగా ఆమె ఇచ్చింది. అదే సమయంలో కళ్ళల్లో కారం కొట్టి పుస్తెల తాడు మెడ పై నుంచి తీసుకుని వెళ్తూ వెళ్తూ బయట తలుపు గడియ పెట్టి వెళ్ళింది. చంద్రకళ కుమారుడు గుండ సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితురాలను గుర్తించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సంపాదకీయం

బహురూపి ఫాసిజం

హిట్లర్ నాయకత్వంలోని జర్మనీ, ముస్సోలిని నేతృత్వంలోని ఫాసిస్టు శక్తులు 1945 మే 9న పరాజయం పాలై ఉండొచ్చు. కానీ ఫాసిస్టు క్రీనీడలు ప్రస్తుతం ప్రపంచంలోని అనేక చోట్ల కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మన దేశంలో ఫాసిస్టు విధానాలను అమలు చేసే ప్రభుత్వం అధికారంలో ఉంది. ఫాసిజం రూళ్ల కర్రతో గీసినట్టు అన్ని చోట్లా ఒకే రకంగా ఉండకపోవచ్చు. కానీ జాతులను, మతాలను, సంస్కృతిని అణచి వేయడంలో ఒకేలా వ్యవహరిస్తుంది. 1931లో హంగరీ, జర్మనీ లాంటి దేశాలలో ఫాసిస్టు శక్తులు కార్మికోద్యమాలను అణచి వేశాయి. గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికవర్గాన్ని ఘోరంగా అణచి వేసింది. మరో వేపున సామ్రాజ్యవాద శక్తులు బలహీనపడడం, జాతీయ విముక్తి ఉద్యమాలు విస్తరించడం దాదాపు ఏక కాలంలో జరిగాయి. ఇటలీ, జర్మనీ లాంటి దేశాలలో ఫాసిజం విలయ నర్తనం చేసింది. అదే సమయంలో స్పెయిన్, ఇటలీ, పోర్చుగల్‌లో కార్మికోద్యమాలు బలపడ్డాయి. సమాంతరంగా ఈ దేశాలలో ఫాసిజం కూడా వేళ్లూనుకుంది. 1917 అక్టోబర్ విప్లవం తరవాత శ్రమజీవులు, కార్మిక వర్గం అనేక చోట్ల సంఘటితమై పోరాడడం సానుకూల అంశం. అయితే కొన్ని దేశాలలో ఫాసిస్టు శక్తులు చెలరేగి పోయాయి. రెండో ప్రపంచ యుద్ధంలో మిత్ర దేశాలు ఫాసిస్టు శక్తులపై విజయం సాధించాయి. సోవియట్ యూనియన్ అంతకంతకు బలపడుతుండడంతో యూరప్ అంతటినీ ఆక్రమిస్తుందన్న భయాందోళనలు కూడా ఫాసిస్టు శక్తుల విజృంభణకు కారణం. రెండో ప్రపంచ యుద్ధం ఆరంభమైనప్పుడు చాలా కాలం అమెరికా ఆ యుద్ధంలో పాల్గొననే లేదు. పర్ల్ హార్బర్ మీద దాడి జరిగితే తప్ప అమెరికాకు చురుకు పుట్టలేదు. ఈ మిత్ర దేశాలు రెండో ప్రపంచ యుద్ధంలో విజయం సాధించినందువల్ల ఫాసిస్టు శక్తులు అంతరిస్తాయన్న ఆశలు అడుగంటాయి. ఏదో ఒక స్థాయిలో ఫాసిస్టు శక్తులు తమ నిజస్వరూపం ప్రదర్శిస్తూనే ఉన్నాయి. ఫాసిజం అంటే అత్యంత ప్రతీప శక్తులు తీవ్రవాద నియంతృత్వాన్ని ప్రదర్శిస్తాయి. ఫాసిజం నిజానికి అత్యంత దురహంకార పూరితమైంది. హిట్లర్ యూదులను వేధించడం దీనికి ప్రబల నిదర్శనం. ఈ వ్యవస్థకు సామ్రాజ్యవాద స్వభావం ఉంటుంది. సాధారణ ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా పరిపాలించలేని ప్రభుత్వాలు ఆఖరి ప్రయత్నంగా ఫాసిజాన్ని ఆశ్రయిస్తాయి. ఫాసిస్టులలో సహజంగానే కరడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకత, ప్రగతిశీల శక్తులను సహించలేకపోవడం, శ్రామికవర్గానికి ప్రాతినిధ్యం వహించే శక్తులను ద్వేషించడం లాంటి ధోరణులు ఉంటాయి. మొదట ఫాసిజం 1922 లో ఇటలీలో, 1933లో జర్మనీలో విజృంభించింది. జర్మనీలో ఫాసిజం జాతీయవాదంపై ఆధారపడింది. రెండవ ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించిందే జర్మనీ. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజం అంతమైనట్టు కనిపించినా అనేక చోట్ల వివిధ రూపాల్లో తలెత్తుతూనే ఉంది. అత్యంత దురహంకార పూరిత ధోరణి, నిర్హేతుకత, జాతి, మత విద్వేషం, ఛాందసత్వం ఫాసిజం ప్రదర్శించే వికృత కళలు. రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వం చెలరేగిన ఫాసిజం ప్రధానంగా యూరప్ దేశాలలోనే కనిపించింది. సంస్కృతిపై ఫాసిజం దాడి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది కనక రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ముందే సాంస్కృతిక రంగంలోని వారు తీవ్రంగా ప్రతిఘటించారు. కొంతమంది మేధావులు 1936లో స్పెయిన్ అంతర్యుద్ధంలో పాల్గొని అమరులు కూడా అయ్యారు.

ఫాసిజం వికృత లక్షణాలన్నీ గత పదకొండేళ్ల మోదీ ప్రభుత్వంలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముస్లింలపై విద్వేష కాల సర్పం పడగవిప్పి నాట్యం చేస్తోంది. మోదీ హయాంలో ముస్లింలపై విద్వేషం అనేక రూపాల్లో వ్యక్తం అవుతోంది. చట్టసభలకు జరిగే ఎన్నికలలో బీజేపీ ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వడంలేదు. పార్లమెంటులో బీజేపీలో ఒక్క ముస్లిం సభ్యుడు కూడా లేరు. చాలా రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి. కానీ ముస్లింలలో, ముఖ్యంగా ముస్లిం మహిళల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందని నమ్మించడానికి చేయని ప్రయత్నం లేదు. ముమ్మారు తలాక్ విధానం రద్దు చేయడం, తాజాగా వక్ఫ్ సవరణ చట్టం తీసుకురావడం ముస్లింల, ముఖ్యంగా పేద ముస్లింలను, మహిళలను ఉద్ధరించడానికేనని నమ్మించడానికి మోదీ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. ముమ్మారు తలాక్ విధానానికి బీజేపీ చెప్పిన భాష్యం అత్యంత వివాదాస్పదమైంది. చాలా రోజులు ముస్లింలకు నలుగురేసి భార్యలు ఉంటారని, అధిక సంతు ఉంటుందని దుష్ప్రచారం చేశారు. నలుగురేసి భార్యలు ఉన్న ముస్లింలు దేశంలో ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చే సాహసం మాత్రం బీజేపీ ఎన్నడూ చేయలేదు. నిరుద్యోగుల సంఖ్యతో పాటు ఎలాంటి గణాంకాలనైనా బీజేపీ విశ్వసించదు. కాకి లెక్కలతో కాలం గడపడానికే ప్రాధాన్యం ఇస్తుంది. వక్ఫ్ వ్యవహారాల్లో కొన్ని సందర్భాలలో అవకతవకలు, అవినీతి జరిగి ఉండొచ్చు. వాటిని నిరోధించడానికి ఇప్పుడు అమలులో ఉన్న చట్టాలు సరిపోతాయి. కానీ మోదీ ప్రభుత్వం ప్రత్యేక చట్టమే తీసుకొచ్చింది. వక్ఫ్‌కు దానం చేయడం అంటే భగవంతుడికి సంపూర్ణంగా ఇచ్చేయడమే. అలాంటి ఆస్తుల మీదే ఎవరికీ క్రయ విక్రయాలకు అవకాశం ఉండదు. ఉండకూడదు. కానీ ఎక్కడైనా అలాంటి అవకాశాన్ని ఆసరాగా తీసుకుని దుర్వినియోగం చేసి ఉంటే దానికి ప్రత్యేక చట్టం అవసరమే లేదు. కానీ ముస్లింలు ఎవరూ అడక్కుండానే చట్టం తీసుకొచ్చారు. ముస్లింల ఉద్ధారకులమని చెప్పుకోవడానికి బీజేపీ తంటాలు పడ్తోంది. పైకి ఎన్ని మాటలు చెప్పినా మౌలికంగా బీజేపీ పెంచి పోషించే విధానం మాత్రం ఫాసిజమే. నిరంకుశత్వం కొనసాగించడానికి చట్టబద్ధ పాలనను మంటగలిపే దుస్సాహసం కూడా ఫాసిస్టు పోకడలో భాగమే. భీమా కోరేగావ్ కేసులో అనేక మందిని దాదాపు ఆరేళ్ల కింద అరెస్టు చేసినా ఇప్పటివరకు ఒక్కరి మీద కూడా విచారణ ఆరంభమే కాలేదు. ఈ లోగా కొందరికి న్యాయస్థానాలు బెయిలు మంజూరు చేశాయి. స్టాన్ స్వామి లాంటి వారు నిర్బంధంలో ఉండగానే మరణించారు. భీమా కోరేగావ్ కేసులో విచారణ ఎప్పుడు మొదలవుతుందో, ఇంకా నిర్బంధంలో ఉన్న వారికి కనీసం బెయిలు అయినా మంజూరు అవుతుందో లేదో తెలియదు. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అపూర్వానంద్‌ను అమెరికాలోని ఒక విశ్వవిద్యాలయం ఆహ్వానిస్తే ఆయనను వెళ్లనివ్వకుండా ఆ విశ్వవిద్యాలయం అడ్డు తగిలింది. అది ఆయనకు ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గా అందిన ఆహ్వానం కాదు. ఆ ఆహ్వానం వ్యక్తిగతమైంది. అయినా ఢిల్లీ విశ్వవిద్యాలయం పెద్దలకు అభ్యంతరకరమైంది. నిజానికి ఆ అభ్యంతరం కేంద్ర విద్యా శాఖకే ఉంది. పహల్గాం సంఘటన తరవాత భర్తను పోగొట్టుకున్న యువతి ముస్లింలు అయినందువల్ల చర్య తీసుకోకూడదని సూచించి తన ఔదార్యం చాటుకున్నారు. కానీ మోదీ ప్రభుత్వం మాత్రం 4 పీఎం చానల్ మీద, పుణ్య ప్రసూన్ బాజ్పాయి చానల్ మీద నిషేధం విధించి వాక్ స్వాతంత్ర్యంపైన, భావప్రకటనా స్వేచ్ఛ మీద ఎంతటి వ్యతిరేకత ఉందో నిరూపించుకున్నది. ఇవన్నీ ఫాసిజం వివిధ రూపాలే. ఇందులో కొన్ని నర్మగర్భంగా ఉండొచ్చు. సారాంశం రీత్యా మాత్రం ఇవన్నీ ఫాసిస్టు పోకడలే. ఇప్పుడు జనం మౌలిక పోరాటాలు ఈ ఫాసిస్టు వ్యతిరేక విధానాల మీదే సాగాలి. ఆ పని చేయాలంటే ఫాసిజం బహురూపి అన్న వాస్తవం గ్రహించాలి.

మాటల మాంత్రికుడు మోదీ

ఆంధ్రులకు ఆర్భాటం, ఆవేశం ఎక్కువని పెద్దలు వూరికే అనలేదు బావ. వందల కోట్లు ఖర్చు పెట్టి ఆర్భాటంగా మోదీని ఆహ్వానిస్తే అయిదు పైసలు కూడా వాగ్దానం చేయలేదు. పైగా ఆయనకు నచ్చిన నినాదాలు మనందరితో పలికించాడు. అదేంటి బావ అలా అంటావు. మనం కలిసి సాదిద్దాం. మనమే చేయాలి మనమే చేద్దాం అన్నాడు గదా అంటే రాజధాని నిర్మాణం కలిసి పూర్తి చేద్దామని అన్నాడు కదా. అంటే మనతోపాటు ఆయన కూడా వచ్చి శ్రమదానం చేస్తాడా ఏంటి. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాలకు వెళ్లి ఇలాగే రిక్త హస్తాలతో తిరిగి వస్తాడా. ఉభయ సభల్లో బిల్లు పాసు కావాలంటే ఆంధ్రుల ఓట్లు కావాలి గాని ఆంధ్రుల రాజధాని నిర్మాణానికి ఎన్ని కోట్లు ఇస్తాడో చెప్పలేదు. మన బాబుగారు మోదీని ఆయన మన బాబును పొగుడుకున్నారు. తప్పులేదు. కాని అసలు విషయం లేని ప్రసంగాల వల్ల ఉపయోగం ఏమిటి. కేంద్ర నిధులతో పూర్తి కావలసిన ప్రాజెక్టుల విషయం గాని, రాజధాని విషయంగాని ఆయన వాటి ఊసెత్తకుండా రైల్వే లైన్ల గురించి వివరించారు. ఇక మన ముఖ్యమంత్రి గారు దాదాపు ఎనిమిదివేల ఎకరాల్లో ప్రపంచం మొత్తం మన వైపు చూసే విధంగా రాజధాని నిర్మిస్తానంటున్నారు. పరిశ్రమలు పరిగెత్తుకుంటూ వస్తాయని లక్షలాది మందికి ఉపాధి, లక్షల యువతకు ఉద్యోగాలు దొరుకుతాయని అంటున్నారు. నిజమే. కాని పరిశ్రమలు పెట్టినందు వల్ల ఉపాధి

ఉద్యోగం దొరికే మాట నిజమే కాని పని చేసినందుకు కూలి, జీతం ఇస్తాడు గాని వాటిపై వచ్చే ఆదాయం పరిశ్రమాధిపతికి దక్కుతుంది. అటువంటప్పుడు ప్రజల ఆస్తులు వందల ఎకరాలు నామమాత్రపు ధరకు వాళ్లకు ధారాదత్తం చేయవలసిన అవసరం ఉందా! పరిశ్రమాధిపతులు స్థలం కొనలేని స్థితిలో ఉన్నారని అనుకోవాలా. ఇటువంటి పరిస్థితులలోనే ప్రతి పార్టీ అధికారంలో ఉండి ఎన్నికల ఫండు పేరుతో వారితో లాలూచీ పడుతున్నారనే అభియోగాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రభుత్వ అధీనంలో పనిచేసే కార్మికులకు యిస్తున్నట్లు బోనసు, సెలవులు లాంటివి ఇవ్వరు.

అసలు పరిశ్రమలు మన కోసం పెడతారా లేక వారి సంపాదన కోసం పెడతారా అంటే మన ప్రజలపై దయతో వారు వచ్చి వేల కోట్లు ఇక్కడ పెట్టరు. కేవలం వారు పరిశ్రమలు పెడితే పని దొరుకుతుందని అలాగే యువతకు ఉద్యోగాలు దొరుకుతాయని మన భూములు వారికే ధారాదత్తం చేయడం సరైనదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రస్తుతం చంద్రబాబు మాత్రమే ఈ పని చేయడం లేదు. గతంలో ఏ ప్రభుత్వమున్నా ఇలాగే ప్రజల భూములు పరిశ్రమాధిపతులకు ధారాదత్తం చేస్తూనే ఉన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల నాడు వచ్చినప్పుడు చెంబుడు నీళ్లు, చారెడు మట్టి తెచ్చి మన మొహానపడేసి వెళ్లారు. ప్రస్తుతం మన ఎంపీలు ఆయనకు అవసరం ఉంది కనుక తప్పకుండా కొన్ని వేల కోట్లు ప్రకటిస్తారనుకున్నా. మన ఆశలపై నీళ్లు చల్లి మాటలతో మంత్రంవేసి మాటల మాంత్రికుడని నిరూపించుకున్నారు. మన ముఖ్యమంత్రి బాబు ఏమీ అడగకుండా బాబు వద్ద చాలా నేర్చుకున్నానని పొగిడి నోరు మెదపకుండా చేశారు.

సంపద సృష్టిస్తానన్న ముఖ్యమంత్రి బాబు మాట నిజం కాబోతోంది. ఆయన రైతుల నుంచి సేకరించిన 10 లక్షల విలువగల భూమిని ఎకరం రెండు కోట్లకు సీఆర్‌డీఏ ద్వారా అమ్మేందుకు పథకం రూపొందిస్తున్నారు. ఈ రకంగా రియల్ ఎస్టేటు వ్యాపారులకు మార్గదర్శి అనిపించుకున్నా సంపద సృష్టికర్తగా గణుతి కెక్కగలరు. రాజధాని నిర్మాణం కేంద్రానిదే కనుక ప్రస్తుతం ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఇబ్బంది ఉండకపోవచ్చు. కష్టపడి రాష్ట్రానికి సంపద సృష్టిస్తానన్న మాట ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నట్లే భావించాలి. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదు నిర్మాణం చేసిన బాబుకు ఇదొక లెక్కలోనిది కాదని కొందరు తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ వాటా మన రాష్ట్రానిదే. ఎప్పటికైనా విడిపోక తప్పదని తెలిసినా సొమ్మంతా గంపగుత్తగా హైదరాబాదు నిర్మాణానికి వెచ్చించడం కొంతమంది బాధను వ్యక్తపరిచారు. 1969, 1972 లోను విడిపోవడానికి జరిగిన ఉద్యమాల వలన విడిపోక తప్పదని అందరు రాజకీయ నాయకులు భావించారు. కాని హైదరాబాదును ఎనలేని నగరంగా నిర్మించి బిల్‌క్లింటన్ పొగడ్తలు బాబు అందుకున్నారు.

ప్రస్తుతం అమరావతి నిర్మాణంపై కూడా సీమ వాసులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కర్నూలు మొదటి రాష్ట్ర రాజధానిగా వ్యవహరించిన తరువాత నవాబు నిర్మించిన భవనాలను ఉపయోగించుకునే నేపథ్యంలో రాజధాని హైదరాబాదుకు మారింది. అప్పటి నుంచి హైకోర్టు కర్నూలుకు తరలించాలనే ఆలోచన అలాగే మిగిలి ఉంది. ప్రస్తుతం రాష్ట్రం చేస్తున్న అప్పు చూసి మేధావులు ఆశ్చర్యం వ్యక్త పరుస్తున్నారు. ఏది ఏమైనా మేధావి అనుభవజ్ఞుడైన చంద్రబాబు రాష్ట్రాన్ని గట్టెక్కిస్తాడనే నమ్మకం చాలామందిలో ఉంది. వేచి చూద్దాం.

సెల్: 9885569394

నాటి ఫాసిజంపై విజయం నేటి పోరాటానికి స్ఫూర్తి

డీవీవీఎస్ వర్మ

ప్రపంచ చరిత్రను మూల మలుపులు తిప్పడంలో సోవియట్ యూనియన్ అద్వితీయ పాత్ర పోషించింది. రష్యాలో 1917లో జరిగిన అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్ర గతిని మార్చింది. పెట్టుబడిదారి వ్యవస్థకు పూర్తిగా భిన్నమైన తొలిసోషలిస్టు రాజ్యం ఏర్పడింది. 1945 మే 9న హిట్లర్ ఫాసిజంపై సోవియట్ యూనియన్ సాధించిన విజయం ప్రపంచ దేశాల బలాబలాలను సమూలంగా మార్చివేసింది. అనేక దేశాలతో సోషలిస్టు శిబిరం ఏర్పడింది. మరో పక్క ఈ విజయం సామ్రాజ్యవాద దేశాల వలస పాలనకు చరమగీతం పాడింది. తుది సమరానికి జాతీయ విముక్తి ఉద్యమాల వెల్లువకు దారి తీసింది. యుద్ధానంతరం అనేక దేశాలు వలస పాలన నుంచి విముక్తి పొంది స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి. రెండో ప్రపంచ యుద్ధం చరిత్ర చదివితే రెడ్ ఆర్మీ, సోవియట్ ప్రజల వీరోచిత పోరాటాలు మనల్ని ఉద్విగ్న భరితుల్ని చేస్తాయి. లెనిన్ గ్రాడ్ ముట్టడి, మాస్కో యుద్ధం, స్టాలిన్ గ్రాడ్ పోరాటం ఒక్కొక్కటి వేలాది మంది ఆత్మార్పణతో సాగించిన యుద్ధం మనల్ని కలిచి వేస్తుంది.

హిట్లర్ జర్మన్ సైన్యాల మీద ఈ యుద్ధం మూడు సంవత్సరాల పది నెలలపాటు జరిగింది.చాలీచాలని తిండి పరిమితమైన ఆయుధ సామగ్రితో అకుంఠిత దీక్షతో సాగిన యుద్ధం. అడుగు అడుగునా రక్తతర్పణ తో సాగిన దీర్ఘకాలిక యుద్ధం. ఈ యుద్ధంలో సోవియట్ సైనికులు, ప్రజలు 2 కోట్ల 60 లక్షల మంది మరణించారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. జర్మన్ ఫాసిస్టు సైన్యానికి పట్టుబడిన 35 లక్షల యుద్ధ ఖైదీలు ఫాసిస్టు మూకల చెరలోనే మరణించారు. జర్మనీ ముందుగా ఆక్రమించిన సోవియట్ ప్రాంతంలో 8 కోట్ల 50 లక్షల జనాభా చిక్కుకున్నారు. అంటే దేశ జనాభాలో 45 శాతం మంది దిగ్బంధం పాలయ్యారు. అక్కడ వున్న 25 లక్షల ఇళ్లల్లో పది లక్షల ఇళ్లను ఫాసిస్టు సైన్యం నేలమట్టం చేసింది. రెండు కోట్ల 50 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. జర్మన్ బలగాలు 1710 సోవియట్ పట్టణాలను, 70 వేల గ్రామాలను ధ్వంసం చేశాయి. 65 వేల కిలోమీటర్ల రైలు, రోడ్డు మార్గాలను నాశనం చేశాయి. ఇంతటి బీభత్సాన్ని, విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని తట్టుకుని నిలబడి రెడ్ ఆర్మీ, సోవియట్ ప్రజలు జర్మన్ ఫాసిస్టు సేనలను వెనక్కి తరిమికొట్టారు. అంతిమంగా 1945 మే 9న హిట్లర్ సైన్యాన్ని వారి సొంతగడ్డపైనే ఓడించి బెర్లిన్ పట్టణాన్ని స్వాధీనం చేసుకుని ఎర్ర జెండా ఎగురవేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్ ఫాసిస్టు సైన్యాన్ని ఓడించిన ఘనత సోవియట్ యూనియన్‌కు దక్కింది. ఇది అడుగడుగునా నెత్తురు పారించి సాధించిన విజయం.

ఫాసిజంపై జరిగిన యుద్ధ కాలంలో భారత ప్రజలు, ఫాసిజానికి వ్యతిరేకంగా దృఢంగా నిలిచారు. 1940 డిసెంబరులో మహాత్మా గాంధీ హిట్లర్‌కు రాసిన లేఖలో ఆయన చర్యలను పరమ కిరాతకమైనవిగా పేర్కొని దాని విజయానికి తమ ఆశీస్సులు వుండవని తేల్చి చెప్పారు. మరోపక్క జవహర్‌లాల్ నెహ్రూ బహిరంగంగానే ఫాసిజాన్ని ఖండిస్తూ రచనలు, ప్రకటనలు చేశారు. ఆయనకు ముస్సోలినీ, హిట్లర్ ప్రభుత్వాలు పంపిన ఆహ్వానాలను తిరస్కరించారు. కమ్యూనిస్టు పార్టీ దీనిని ప్రజా యుద్ధంగా ప్రకటించింది. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ముమ్మరంగా సాగించింది. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు సభలు, సమావేశాలలో ఫాసిజం ప్రమాదం మీద విస్తృతంగా ప్రచారం చేశాయి. అభ్యుదయ రచయితలు ఉత్తేజపరిచే పాటలు, నాటికలు వంటి కళారూపాలను రచిస్తే ప్రజా నాట్యమండలి బృందాలు కళారూపాల ద్వారా ఫాసిజాన్ని ఎండగట్టారు. మహాకవి శ్రీశ్రీ రచించిన 'గర్జించు రష్యా గాండ్రించు రష్యా' అనే గేయం విశేష ప్రజాదరణ పొందింది.

రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయం సాధించడంతో, ఆ పోరాటంలో విముక్తి పొందిన దేశాలలో కమ్యూనిస్టు బృందాలు అధికారంలోకి వచ్చాయి. ఒకే ఒక సోషలిస్టు రాజ్యం ఇప్పుడు 12 దేశాల బృందం అయింది. బ్రిటన్‌కు రవి అస్తమించని సామ్రాజ్యం అనే పేరు వుంది. అనేక వలస దేశాల మీద పెత్తనం వుంది. అలాగే ఫ్రాన్స్‌కీ వలస దేశాలున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంలో ఈ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. మరో పక్క ఫాసిజంపై విజయం తర్వాత అనేక దేశాలలో జాతీయ విముక్తి ఉద్యమాలు తీవ్ర రూపం ధరించాయి. వలస పాలకులు ఇక్కడ పాలించడం అసాధ్యంగా మారింది. పర్యవసానంగా 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అనతి కాలంలోనే అనేక దేశాలు స్వతంత్ర దేశాలయ్యాయి. మరో పక్క చైనాలో విప్లవం విజయవంతం అయింది. మే 9 ఫాసిజంపై సోవియట్ సాధించిన విజయం తర్వాత ఒక కొత్త ప్రపంచం ఏర్పడింది. వలస దేశాల స్థానంలో స్వతంత్ర రాజ్యాలు పుట్టుకొచ్చాయి. సోషలిస్టు శిబిరం ఏర్పడడంతో ఈ స్వతంత్ర దేశాలు అలీన విధానం అనుసరించడానికి వీలు కలిగింది. బలమైన అలీనోద్యమం ఏర్పడటంతో సామ్రాజ్యవాదులు ఆడింది ఆట పాడింది పాట కాకుండా పోయింది. భారతీయ ఫాసిజం: 1945 మే 9తో ఫాసిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. ఇటలీలో ముస్సోలినీని ప్రజలు కొట్టి చంపారు. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఫాసిస్టు రాజ్యాలు పతనం అయినా వాటితో పాటే ఫాసిస్టు భావజాలం మాత్రం అంతరించలేదు. భారతదేశంతో సహా అనేక దేశాలలో ఫాసిస్టు శక్తులు పనిచేస్తూనే ఉన్నాయి. 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పడింది. దాని వ్యవస్థాపకుడు డా.హెగ్డేవార్. ఆయన గురువు బీఎస్ మూన్‌జీ. అలాగే "హిందూత్వ" భావనకు రూపుదిద్దినవాడు దామోదర సావార్కర్. ఆయన హిందూ మహాసభ పేరుతో ఉన్నాడు. ఆర్ఎస్ఎస్ దాని సంఘ్ పరివారం ఏర్పడేనాటికి వారికి ముస్లిం వ్యతిరేకత తప్ప స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక వున్నట్టు కనిపించదు. వారు ఫాసిస్టు భావజాలాన్ని ముస్సోలినీ, హిట్లర్ నుంచి పొంది దానిని భారతీయ పరిస్థితులకు అనుగుణంగా రూపొందినట్టు కనిపిస్తుంది. ఇటాలియన్ పరిశోధకురాలు మర్జినా కసోలారీ దీనిని సాధికారికంగా నిరూపించారు. బీఎస్ మూన్‌జీ డైరీల నుంచి ఆమె ఈ సమాచారాన్ని సేకరించారు. మూన్ జీ తన డైరీలో (మార్చి 19, 1931) ముస్సోలినీ ప్రత్యక్షంగా కలిసి మాట్లాడినట్టు, అక్కడ ఫాసిస్టు యువజన సంఘం కార్యకలాపాలు చూసినట్లు అలాంటి సంస్థలు ప్రతి దేశానికి అవసరమని ముస్సోలినీకి చెప్పినట్టు దానికి ఆయన అలాంటి కృషిలో విజయం సాధించాలని ఆకాంక్షించినట్లు రాసుకున్నారు. ఆయన భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత మార్చి 31న హెడ్గెవార్ తదితర మిత్రులతో అలాంటి "హిందువుల మిలటరీ ఆర్గనైజేషన్ ఏర్పాటు గురించి చర్చించినట్టు" రాసుకున్నారు.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త గురు గోల్వాల్కర్ జర్మన్ జాతి స్వచ్ఛత, సంస్కృతి కోసం సెమిటిక్ జాతికి చెందిన యూదులను ఏరి వేయాలన్న సూత్రం మనకు దారి చూపిస్తుందని ప్రకటించాడు. 1938 జూన్ 14న సావార్కర్ ప్రసంగిస్తూ హిట్లర్ యూదు వ్యతిరేక కార్యక్రమం భారత్‌లో ముస్లిం సమస్యకు పరిష్కారంగా సూచించాడు. ఆర్ఎస్ఎస్ సంఘ పరివారం ముస్సోలినీ, హిట్లర్ ఫాసిజాలను అనుసరించిన తీరులో ఎన్నో సారూప్యతలు కనిపిస్తాయి. హిట్లర్ ఆర్య జాతి ఆధిపత్యాన్ని ప్రకటిస్తే సంఘ్ పరివారం హిందూ రాష్ట్ర పేరుతో హిందూ ఆధిపత్యాన్ని ప్రకటిస్తున్నది. హిట్లర్‌కు యూదు వ్యతిరేకత రాజకీయమైతే ఇక్కడ ముస్లిం వ్యతిరేకత రాజకీయం అయింది. అక్కడ యూదులకు పౌరసత్వం తొలగించే చట్టాలను ముందుకు తెచ్చారు. ఇక్కడా అలాంటి పౌరసత్వ చట్టాలకు రూపుదిద్దారు. అక్కడ యూదులతో వివాహాలను నిషేధిస్తే ఇక్కడ అదే తరహా లవ్ జిహాద్‌ను ముందుకు తెచ్చారు. జర్మన్ జాతి గత వైభవాన్ని ప్రస్తావిస్తే ఇక్కడ గత హిందూ వైభవం గురించిన చర్చ చేస్తున్నారు.

ఇప్పుడు అధికారంలో వున్న హిందూత్వ రాజకీయ వాదం "హిందూ రాష్ట్ర" సాధన కోసం పావులను కదుపుతున్నది. ఇటీవల జరిగిన కుంభ మేళాలో సంఘ్ పరివార బృందం తమ "హిందూ రాష్ట్ర రాజ్యాంగ ముసాయిదా" లోని అంశాలను ప్రకటించింది. ఈ "రాజ్యాంగాన్ని మనుస్మృతి, కౌటిల్యుని అర్థశాస్త్రం" ఆధారంగా రూపొందించినట్లు చెప్పారు. హిందువులకు మాత్రమే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు పోటీ చేసే హక్కు వుంటాయని స్పష్టం చేశారు. భారతీయ ఫాసిజం లక్ష్యం ప్రస్తుత రాజ్యాంగాన్ని తొలగించి మత రాజ్యాంగాన్ని తీసుకు రావడం. దేశాన్ని ప్రజాస్వామ్యయుగం నుంచి ఆటవికమైన మనువాద యుగాలకు నడిపించడం. ఈ తరహా భారతీయ ఫాసిజాన్ని ఓడించడం మన తక్షణ కర్తవ్యం అయింది. ఈ సవాల్‌ను ఎదుర్కొనడానికి మే 9 న " ఫాసిజం పై విజయం" 80 వార్షికోత్సవం నేటి ఫాసిజంపై పోరాటానికి మనకు స్ఫూర్తి దాయకం కావాలి.

దారి దీపం సంపాదకులు
సెల్:85006 789771

ఉత్సాహం నింపిన ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

కేవీవీ ప్రసాద్

స్వాతంత్రోద్యమకాలంలో పురుడు పోసుకొని రైతాంగ సంక్షేమం, హక్కుల కోసం వీరోచిత పోరాటాలు నడిపిన అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 30వ జాతీయ మహాసభలు తమిళనాడులోని నాగపట్నంలో ఏప్రిల్ 15-17 తేదీలలో విజయవంతంగా ముగిశాయి. డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ నేతృత్వం వహించిన జాతీయ రైతు కమిషన్‌లో సభ్యులు ఇటీవల మృతి చెందిన అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ హాల్‌గా జాతీయ మహాసభల వేదికకు నామకరణం జరిగింది. మహాసభలలో 22 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తూ అసోం నుంచి పంజాబ్ వరకు, ఉత్తరాఖండ్ నుంచి కేరళ వరకు 650 మందికి పైగా వివిధ రైతాంగ ఉద్యమాలలో పాల్గొని రైతాంగ హక్కులు, సంక్షేమం కోసం కృషిచేసిన ప్రతినిధులు పాల్గొనడం రైతు ఉద్యమ విస్తరణను ప్రతిబింబించిందని మహాసభలో నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టిన కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య వివరించారు. కిసాన్ సభ నిర్వహించిన వీరోచిత పోరాటాలను, భవిష్యత్తు కార్యక్రమాన్ని మహాసభ ముందు ఉంచారు. కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రాజన్ క్షీరసాగర్ అంతర్జాతీయ, జాతీయస్థాయిలో రైతాంగం, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థవంతంగా మహాసభలో పాల్గొన్న ప్రతినిధులకు వివరించారు.

వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. భారతదేశ వ్యవసాయ రంగం, రాష్ట్రాలలో పంటల సాగు, నూతన వ్యవసాయ విధానం, మార్కెటింగ్, సహకారరంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానంతో దేశ వ్యవసాయ రంగంపై పడుతున్న ప్రభావం, చట్టబద్ధ ఎమ్మెస్పీ కోసం ఆందోళన, వ్యవసాయ రంగంపై ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ ప్రభావం, నూతన వ్యవసాయ వంగడాలు, యాంత్రీకరణ ఆవశ్యకత, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కేంద్ర నిధులు, రైతురంగ నిర్మాణ విస్తరణ ఆవశ్యకత తదితర అంశాలపై విస్తృత చర్చ జరిపారు. దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై సమావేశాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించాలనీ, దేశవ్యాపిత ఉద్యమం చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహిస్తున్న ఉద్యమంలో రైతుసంఘ భాగస్వామ్యం పెంచాలని మహాసభలో నిర్ణయించారు.

రైతాంగ సమస్యలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై మహాసభ 29 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. వాటి అమలుకోసం స్వతంత్రంగాను, ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని మహాసభ పిలుపునిచ్చింది. రైతాంగ ఉత్పత్తులకు చట్టబద్ధ ఎమ్మెస్పీ (సి2+50శాతం) సాధించాలి. అప్పుల్లో ఉన్న రైతులు, కౌలు రైతులకు ఒక పర్యాయం రుణ మాఫీ చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన 'జాతీయ వ్యవసాయ మార్కెట్ విధాన చట్రం'ను ఉపసంహరించు కోవాలి. భారత రైతాంగానికి జరిగే నష్టం కారణంగా ఇండో-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని కేంద్రం ఉపసంహరించు కోవాలని కోరుతూ మహాసభ తీర్మానించింది. అటవీ భూముల సాగుదారుల హక్కులను కాపాడాలి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు రక్షణ కల్పించాలి. రైతాంగ సాగునీటి హక్కులకు రక్షణ కల్పిస్తూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సత్వర పూర్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలి. రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాల పరిష్కారానికి సత్వరం కృషి చేయాలి. 60 సంవత్సరాలు నిండిన రైతు, కౌలు రైతు, గ్రామీణ పేదలకు నెలకు రూ.10వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలి. కేంద్రం తెచ్చిన వక్ఫ్ భూముల చట్టాన్ని ఉపసంహరించాలి. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న మతోన్మాద, నియో ఫాసిజం విధానాలపై గ్రామీణ ప్రజలలో విస్త్రత ప్రచారం చేయాలి. దళితులు, ఆదివాసీ రైతులపై జరుగుతున్న దాడులను మహాసభ తీవ్రంగా ఖండించింది. ప్రకృతి వైపరీత్యాలవల్ల నష్టపోతున్న పంటలకు, రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంటల బీమా వర్తింప చేయాలని తదితర తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దేశ వ్యాప్తంగా రైతుసంఘ నిర్మాణాన్ని ఎలా విస్తృత పరచాలనే అంశంపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. 400 జిల్లాల్లో లక్ష గ్రామాల్లో

రైతుసంఘ కమిటీలు ఏర్పాటు చేయాలని తద్వారా గ్రామీణ స్థాయి నుంచి సంఘ నిర్మాణంపై దృష్టి సారించాలని, ప్రతి సంవత్సరం సభ్యత్వ కార్యక్రమాన్ని కొనసాగించాలని మహాసభ నిర్ణయించింది.

ఆకర్షణీయంగా రైతు ర్యాలీ :- మహాసభల ముగింపు సందర్భంగా నాగపట్నంలో సుమారు 40 వేల మంది రైతులు, గ్రామీణ పేదలతో రైతు ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీలో పూర్తిగా గ్రామీణ ప్రాంత రైతులు, రైతు మహిళలు పాల్గొనడం, తమిళసాంప్రదాయానికి చిహ్నంగా సాంస్కృతిక దళాలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ ఇతివృత్తంతో కూడిన నృత్య రూపాలు, కళా బృందాలు ప్రదర్శనలో పాల్గొనడం ప్రత్యేక విశేషం. అనంతరం జరిగిన బహిరంగ సభకు నాగపట్నం ఎంపీ, మహాసభల ఆహ్వానసంఘ అధ్యక్షులు వి. సెల్వరాజ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, కిసాన్‌సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య, సీపీఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఆర్. ముత్తరాసన్, శాసనసభ్యులు టి. రామచంద్రన్, తిరుపూర్ పార్లమెంటు సభ్యులు కె. సుబ్బరాయన్, రైతుసంఘం తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసిలమణి, వ్యవసాయ కార్మికసంఘం జాతీయ అధ్యక్షులు ఎన్. పెరియ స్వామి, తిరుత్తరాయ్‌కుండి నియోజకవర్గ శాసనసభ్యులు కె. మరిముత్తు తదితరులు పాల్గొన్నారు. మహాసభల ప్రారంభసూచికగా ఏప్రిల్ 15న కిసాన్‌సభ సీనియర్ నాయకులు తారాసింగ్ సిద్ధు రైతుసంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. హైదరాబాదులో జరిగిన 29వ మహాసభల గౌరవార్థం రైతుసంఘ తెలంగాణా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ నాయకత్వాన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలగుండా పర్యటిస్తూ మహాసభ ప్రాంతానికి చేరుకున్న రైతుసంఘ పతాకాన్ని కేరళ రాష్ట్ర సీనియర్ నాయకులు వి. చామున్ని స్వీకరించారు. అదే విధంగా తమిళనాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతు పోరాట యోధుల స్థూపాల నుంచి తెచ్చిన రైతుసంఘ పతాకాలను జాతీయ, రాష్ట్ర నాయకత్వం స్వీకరించింది. మహాసభ ప్రారంభ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా అనేక మంది ప్రముఖ రైతు నాయకులు హాజరయ్యారు. భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షులు రాకేష్ తికైత్, ఏఐకేఎస్ (సూర్జిత్ భవన్) ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, ఏఐకేఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజారామ్‌సింగ్, జాతీయ మహిళాసమాఖ్య నాయకురాలు నిషా సిద్ధు, ఏఐటీయుసి నాయకులు రామకృష్ణ పాండా, మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు పెరియస్వామి, అఖిల భారత యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి తిరుమలై, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి దినేష్ పాల్గొని సౌహార్ద సందేశాలిచ్చారు. మహాసభలకు అధ్యక్షవర్గంగా రాజన్ క్షీరసాగర్, తారాసింగ్ సిద్ధు, పి.సంతోష్ కుమార్, బల్‌దేవ్ సింగ్ నిహల్‌గర్, ఆశేష్ కాంగో, పీఎస్ మసిలిమణి, ఇబోబి సింగ్, కేవీవీ ప్రసాద్, దేవభక్తుని సంధ్యారాణి వ్యవహరించారు. నాగపట్నం పురవీధులన్నీ రైతు సంఘ పతాకాలు, తోరణాలు, మృతవీరుల చిహ్నాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ సమితికి ఎన్నికైన సమితి సభ్యులు : జాతీయ సమితి కార్యదర్శిగా కె.వి.వి.ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా జి.ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులుగా పి.రామచంద్రయ్య, ఎ. కాటమయ్య, పి. జములయ్య, కె. జగన్నాథం, చిరుతల మల్లిఖార్జున, బుడితి అప్పల నాయుడు, కె. వీరారెడ్డి, పి. గంగాభవాని ఎన్నికయ్యారు.

ప్రధాన కార్యదర్శి - ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ వెనక్కి

న్యూఢిల్లీ: పాక్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ కృష్ణన్‌ను వాయుసేన వెనక్కి పిలిపించింది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం వాయుసేన నుంచి ఎంపికైన వారిలో అజిత్ ఒకరు. తాజాగా దిల్లీలో నిర్వహించిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన... ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 'ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఐఏఎఫ్ నుంచి నాకు పిలుపొచ్చింది' అని తెలిపారు. వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా గగన్‌యాన్ యాత్రకు ఎంపికయ్యారు. భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందం వీరే. 2027లో ఈ యాత్ర జరగనుంది. దీనికోసం అజిత్, అంగద్ భారత్‌లో శిక్షణ పొందుతుండగా... శుభాంశు శుక్లా, నాయర్ అమెరికాలో శిక్షణ తీసుకుంటున్నారు.

ఉగ్రవాదంపై పోరుకు పూర్తి మద్దతు

అఖిలేశ్ యాదవ్

లక్నో : ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ గురువారం తెలిపారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశం ఐక్యంగా ఉండవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో అఖిలేశ్ మాట్లాడుతూ 'ఉగ్రవాద మూలాలను సమూలంగా నాశనం చేయాలని ప్రతి పార్టీ పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రం జరిపే పోరుకు మేము పూర్తి మద్దతు ఇస్తున్నాం' అని చెప్పారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో వైమానిక బాంబు దాడులు జరిపిన ఒక రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి సమయంలో పక్షపాత, రాజకీయ ప్రయోజనాలకు దూరంగా ఉండటం ముఖ్యమని పునరుద్ఘాటించారు. 'ఉగ్రవాదాన్ని పూర్తిగా తుదిముట్టించాలన్న లక్ష్యం సుస్పష్టం. మన సరిహద్దులు కచ్చితంగా సురక్షితం ఉండాలి. మన సైనికుల మనోధైర్యం ఉన్నతంగా ఉండాలి. మైనస్ 50 డిగ్రీల క్లిష్టమైన ఉష్ణోగ్రతలో మన సైనికులు దేశ రక్షణ కోసం పరిశ్రమిస్తున్నారు. అటువంటి దారుణ పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్న సైన్యాలు ప్రపంచంలో చాలా తక్కువ' అని అఖిలేశ్ తెలిపారు.

ఫేక్ యుద్ధానికి తెరలేపిన పాక్

'ఫ్యాక్ట్ చెక్'తో బదులిచ్చిన భారత్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' తో పాక్‌కు గట్టి బదులిచ్చింది. ఈ దాడితో పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దిక్కుతోచని స్థితిలో భారత్‌పై విషం చిమ్మే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో 'ఫేక్ యుద్ధానికి' తెరలేపింది. సోషల్ మీడియా వేదికగా ఫేక్ ప్రచారం మొదలు పెట్టింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పై తమ సైన్యం దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోంది. భారత్‌లోని ఐదు నగరాలపై దాడులు చేసినట్లు చెప్పుకుంటోంది. ఇందుకు సాక్ష్యంగా పాత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి భారత్‌పై దుష్ప్రచారం చేస్తోంది. అమృత్‌సర్‌లోని మిలిటరీ బేస్‌పై మిస్సైళ్ల దాడి చేసినట్లు కూడా ప్రచారం చేస్తోంది. అయితే, పాక్ ఫేక్ ప్రచారాన్ని భారత్ సమర్థవంతంగా తిప్పికొడుతోంది. ఫ్యాక్ట్ చెక్‌తో పాక్ తప్పుడు వార్తలకు చెక్ పెట్టి పాక్‌కు గట్టి బదులిస్తోంది. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్‌తో ఆధారలతో సహా పాక్ తప్పుడు ప్రచారాన్ని బయటపెట్టింది.

పంజాబ్ పొలాల్లో రాకెట్ శకలాలు

చండీగఢ్: పంజాబ్‌లోని పొల్లాల్లో ఓ క్షిపణి శకలాలను గుర్తించారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టిన వేళ ఈ ప్రదేశంలో భారీ శబ్దం వచ్చిందని, ఆ తర్వాత విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ శకలాలను జేతువాల్, మఖాన్ విండి, పంధేర్ వద్ద పొలాల్లో గుర్తించినట్లు వెల్లడించారు. 'పేలుడు తర్వాత చుట్టుపక్కల మొత్తం భయం నెలకొంది. క్షిపణి శకలాలు జేతువాల్‌లోని పొలాల్లో పడ్డాయి' అని ప్రకాశ్ సింగ్ అనే స్థానికుడు చెప్పాడు. మరోవైపు దీనికి సమీపంలోని మఖాన్ విండి గ్రామస్థులు కూడా తమ పొలాల్లో రాకెట్ శకలాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సైనిక దళాలు అక్కడకు చేరుకున్నాయి. ఈ గ్రామం అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి సమీపంలోని ఓ పొలంలో దాదాపు ఆరు అడుగుల పొడవైన శకలం ఉండటం గమనార్హం. ఈ విషయాన్ని పంజాబ్ పోలీసులు ధ్రువీకరించారు.

డ్రోన్లపై నిషేధం

లేహ్: లదాక్ కేంద్ర పాలిత ప్రాంతంలో డ్రోన్లు, యూఏవీలపై నిషేధం విధించారు. డ్రోన్లను దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నాయని, జాతి వ్యతిరేకులు వాటిని తప్పుగా వాడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. స్థానికులు, పర్యాటకులు, ప్రైవేటు వ్యక్తులు డ్రోన్లు ఎగురవేయరాదని లేహ్ జిల్లా మెజిస్ట్రేట్ సంతోశ్ సుఖదేవ్ తన ఆదేశాల్లో తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘిస్తే... న్యాయపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు. ప్రజల రక్షణ, భద్రత దృష్ట్యా ఈ ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలను భారత రక్షణ దళాలు ధ్వంసం చేసిన తర్వాత స్థానిక ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 163 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. డ్రోన్ల కదలికలు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని చెప్పారు. విమానాలు రద్దు కావడం వల్ల చిక్కుకుపోయిన టూరిస్టులకు బస ఏర్పాట్లు కల్పించనున్నట్లు తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'

నిరంతరం అప్రమత్తం

ఉన్నతస్థాయి సమావేశంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన వేర్వేరు మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమావేశం గురువారం ఇక్కడ జరిగింది. జాతీయ భద్రత, కార్యాచరణ సంసిద్ధత పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ నిరంతర అప్రమత్తత, స్పష్టమైన కమ్యూనికేషన్ కోసం ఆయన పిలుపునిచ్చారు. పౌర రక్షణ యంత్రాంగాలను బలోపేతం చేయడం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు, కీలకమైన మౌలిక సదుపాయాల భద్రతను నిర్ధారించడం వంటి అంశాలు సమావేశంలో చర్చించినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. రాష్ట్ర అధికారులు, క్షేత్రస్థాయి సంస్థలతో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని మంత్రిత్వశాఖలకు సూచించినట్లు పేర్కొంది. భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులు పాల్గొన్న ఉన్నత స్థాయి సమావేశంలో జాతీయ భద్రతకు సంబంధించి ఇటీవలి పరిణామాల దృష్ట్యా జాతీయ సంసిద్ధత, అంతర్-మంత్రిత్వశాఖల సమన్వయాన్ని సమీక్షించారు. కార్యాచరణ కొనసాగింపు, సంస్థాగత స్థితిస్థాపకతను నిలబెట్టుకోవడానికి మంత్రిత్వ శాఖలు, సంస్థల మధ్య సజావుగా సమన్వయం అవసరమని ప్రధాని మోదీ నొక్కి చెప్పారని ప్రకటన తెలిపింది. 'దేశం సున్నితమైన కాలంలో ప్రయాణిస్తున్నందున నిరంతర అప్రమత్తత, సంస్థాగత సమష్టితత్వం, స్పష్టమైన కమ్యూనికేషన్ కోసం ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. జాతీయ భద్రత, కార్యాచరణ సంసిద్ధత, పౌరుల భద్రతకు ప్రభుత్వ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు' అని ప్రకటన పేర్కొంది. భారత సాయుధ దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడానికి మంత్రిత్వ శాఖల ప్రణాళిక, సన్నద్ధతను సమీక్షించారు. కార్యదర్శులు తమ మంత్రిత్వ శాఖల కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించాలని, సంసిద్ధత, అత్యవసర ప్రతిస్పందన, అంతర్గత కమ్యూనికేషన్ ప్రొటోకాల్‌పై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన వ్యవస్థల విశ్వసనీయ పని తీరును నిర్ధారించాలని ఆదేశించినట్లు' ఆ ప్రకటన పేర్కొంది. ప్రస్తుత పరిస్థితిలో 'మొత్తం ప్రభుత్వ' విధానంతో కార్యదర్శులు తమ ప్రణాళికను వివరించారని వెల్లడించింది. అన్ని రకాల ఉద్భవిస్తున్న పరిస్థితులను ఎదుర్కోవడానికి మంత్రిత్వ శాఖలు సిద్ధంగా ఉన్నాయని ప్రకటన తెలిపింది. ఈ సమావేశంలో క్యాబినెట్ కార్యదర్శి, ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, రక్షణ, హోం వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాలు, సమాచార-ప్రసార, విద్యుత్, ఆరోగ్యం, టెలికమ్యూనికేషన్స్ వంటి కీలక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

దౌత్యంతో మొదలుపెట్టి... ఉగ్రస్థావరాలు కూల్చి...

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత అన్నివైపుల నుంచి పాకిస్థాన్‌ను భారత్ దిగ్బంధం చేసింది. ఆర్థిక, దౌత్య, వాణిజ్యరంగాల్లో దానిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచింది. పాక్ ఒత్తిడిని ఎదుర్కొనే క్రమంలో ఉండగానే ఉగ్రస్థావరాలు లక్ష్యంగా సైనిక చర్య చేపట్టింది. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరిత ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకొన్నారు. భార్యలను భర్తలను వేరు చేసి... వారి మతం అడిగి కాల్చిచంపారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. అదే సమయంలో సౌదీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ అర్ధంతరంగా దానిని రద్దు చేసుకొని 23వ తేదీన భారత్ చేరుకొన్నారు. ఆయన పీఎంవోకు కూడా వెళ్లకుండా విమానాశ్రయంలోనే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉగ్రదాడిని ప్రభుత్వం ఎంత తీవ్రంగా పరిగణించిందో ఈ పరిణామాలు చెప్పాయి. పాక్‌తో ఉన్న సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. నీటి విడుదలను బాగా తగ్గించింది. పాక్ జీడీపీలో దాదాపు 24 శాతం ఈ జలాల నుంచే లభిస్తుంది. ఇవే కాకుండా పాక్ సైనిక, రవాణా, పౌర విమానాల కోసం భారత్ గగనతలాన్ని మూసి వేసింది. పాక్ దేశీయుల వీసాలు రద్దు చేసి... దేశాన్ని వీడాలని ఆదేశించింది. అట్టారీ-వాఘా సరిహద్దు గేట్లు మూసేసింది. దీంతోపాటు పాక్ నటుడు ఉన్న సినిమా విడుదలను నిలిపివేసింది. పాక్ నటీనటులు, క్రికెటర్లు, రాజకీయ నాయకులు సహా యూట్యూబ్, ఇన్‌స్టా ఇతర సోషల్ మీడియా ఖాతాలను భారత్‌లో బ్లాక్ చేసింది. వీటిలో మహీరా ఖాన్, హానియా ఆమీర్, అలీజఫర్ వంటి వారి ఖాతాలు ఉన్నాయి. తర్వాత పాక్‌తో వాణిజ్య సంబంధాలను భారత్ పూర్తిగా తెంచుకొంది. మే నెల ఆరంభంలో పాక్ నుంచి దిగుమతులు, ఆ దేశానికి ఎగమతులు నిలిపివేసింది. పాక్ నౌకలు మన ఓడరేవుల్లోకి రాకుండా నిషేధం విధించింది. దేశానికి ఎగుమతి అయ్యే ఔషధాలపైనా ఆంక్షలు విధించింది. చాలా ఏళ్లుగా రెండుదేశాల మధ్య నేరుగా వాణిజ్యం జరగకపోయినా... యూఏఈ, సింగపూర్, ఇండోనేసియా, శ్రీలంక వంటి దేశాల నుంచి భారత్‌కు ఎగుమతులు చేసేది. పండ్లు, ఎండు కర్జూరాలు, టెక్స్‌టైల్స్, రాక్ సాల్ట్, లెదర్ వస్తువులు అందులో ఉండేవి. వీటి విలువ 500 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఐఎంఎఫ్ నుంచి పాక్‌కు లభించాల్సిన రుణాన్ని పునఃసమీక్షించాలని భారత్ ఒత్తిడి పెంచేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. అదేసమయంలో ఉగ్రవాదులకు ఊహించని రీతిలో శిక్ష ఉంటుందని పాక్‌ను ప్రధాని మోదీ హెచ్చరించారు. దీంతో సైనిక చర్య ఖాయమన్న విషయాన్ని ఆయన తేల్చేశారు. ఆ మర్నాడే జరిగిన అఖిలపక్ష సమావేశంలో అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వం తీసుకోబోయే చర్యలకు మద్దతు తెలిపాయి. మరోవైపు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని పాక్ దళాలు సరిహద్దుల్లో కాచుకు కూర్చొన్నాయి. వరుసగా సైనికాధికారులు, మంత్రులతో జరిగిన భేటీలు పాక్ నాయకుల్లో ఆందోళన పెంచాయి. దీంతో పాక్ నేతలు అణు బెదిరింపులకు దిగారు. అయినా భారత్ మౌనంగా తన ఏర్పాట్లు తాను చేసుకొంటూ వెళ్లింది. అమెరికా, రష్యా, ఫ్రాన్స్, సౌదీ, యూఏఈ వంటి కీలక మిత్ర దేశాలకు పరిస్థితిని వివరించింది. ఐరాస భద్రతా మండలిలో పాక్‌కు ఎటువంటి మద్దతు రాకుండా దౌత్యం నెరిపింది. దేశ ప్రజల కోసం వార్ మాక్ డ్రిల్స్‌ను మే7వ తేదీన నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇవి మొదలుకావడానికి కొన్ని గంటల ముందే పాక్ ఊహించని విధంగా దాడి చేసి 9 ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టింది.

ధ్వంసమైన ఉగ్ర శిబిరాల ఉపగ్రహ చిత్రాలు



న్యూఢిల్లీ: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడికి భారత్ గట్టిగా బదులు తీర్చుకుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్‌లో మెరుపు దాడులు చేసింది. లష్కరే తోయిబా, జైషే ఉగ్రముఠాలే లక్ష్యంగా 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతంగా చేపట్టింది. ఈ మెరుపుదాడుల్లో తొమ్మిది ఉగ్రశిబిరాలు ధ్వంసమయ్యాయి. వీటికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలు తాజాగా బయటికొచ్చాయి.

ఈ దాడుల్లో బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం, మురీద్కేలోని లష్కరే తోయిబా ఉగ్ర శిబిరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. వాటి శాటిలైట్ చిత్రాలను మాక్సర్ టెక్నాలజీ తీసింది. భారత్ జరిపిన క్షిపణి దాడితో బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ డోమ్ కూలిపోయింది.

మురీద్కేలోని లష్కరే శిబిరం పూర్తిగా నేలమట్టమైనట్లు ఆ చిత్రాల్లో ఉంది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత దాదాపు 25 నిమిషాల పాటు భారత్ ఈ మెరుపు దాడులు చేసింది. పాక్ సైనిక స్థావరాలు, నివాసాలపై దాడి చేయకుండా కేవలం ఉగ్ర శిబిరాల లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించింది.

అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

భారత్-పాక్ ఉద్రిక్తతలపై సిద్ధరామయ్య

బెంగళూరు: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా హెచ్చరికలు జారీ చేసిందని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం అన్నారు. భద్రతా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనలను పాటిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలోని ఆనకట్టలు, ఇతర ముఖ్యమైన సంస్థాపనల వద్ద భద్రతను పెంచారా అనే ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానమిస్తూ... 'ఎప్పుడయినా ఏదైనా జరగవచ్చు. అందువల్ల మేము ప్రతిచోటా హెచ్చరికలు జారీ చేశాం. జాగ్రత్తలు తీసుకున్నాం' అని చెప్పారు. అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ జరుగుతున్నాయని, కేంద్రం జారీ చేసిన సూచనలను పాటిస్తున్నామని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. కర్నాటకలో ఇప్పటికీ ఉన్న కొంతమంది పాక్ జాతీయులను బహిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోలేదని బీజేపీ చేస్తున్న ఆరోపణల గురించి అడిగినప్పుడు... ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'దాదాపు అందరూ వెళ్లిపోయారు. మైసూరు నుంచి ఒక కుటుంబం కోర్టుకు వెళ్లింది. అలాంటి కేసులు మాత్రమే ఇప్పటికీ ఉండవచ్చు, లేకుంటే అందరూ వెళ్లిపోయారు' అని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా ఎంత మంది పాకిస్తానీలు ఉన్నారనే దానిపై తన వద్ద కచ్చితమైన సమాచారం లేదని ఆయన అన్నారు. కర్నాటక హిందూ మత సంస్థలు, ధార్మిక దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చే అన్ని దేవాలయాలలో సాయుధ దళాల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి తనతో మాట్లాడి సూచనలు ఇచ్చారని సిద్ధరామయ్య అన్నారు.

భారత్‌కు సుదర్శన చక్రం ఎస్-400

పాక్ క్షిపణి దాడి భగ్నం

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్ పెంపుడు ఉగ్రవాదుల స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. దీంతో రగిలిపోతున్న పాకిస్థాన్... భారతదేశంలోని 15 నగరాలపై డ్రోన్, క్షిపణి దాడులకు ప్రయత్నించి భంగపడింది. ముఖ్యంగా, సరిహద్దుల్లో ఉన్న అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తల, జలంధర్, లూథియానా, ఆదంపూర్, భటిండా, చండీగఢ్, నల్, ఫలోడి, ఉత్తరాలాయ్, భుజ్ సహా అనేక సైనిక లక్ష్యాలపై దాడులకు యత్నించింది. ఈ దాడుల్ని భారత గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. ముఖ్యంగా, రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ భారత్‌కు ఉపయోగపడింది. పాకిస్థాన్ నుంచి దూసుకువస్తున్న డ్రోన్లు, క్షిపణుల్ని అడ్డుకుని, గాలిలోనే ధ్వంసం చేసింది. పాక్ క్షిపణులను ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్ అండ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లు న్యూట్రలైజ్ చేసినట్లు భారత రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. భారత్, రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎస్-400కి సుదర్శన చక్రగా నామకరణం చేసింది. ప్రపంచంలో అత్యున్నతమైన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఇది ముందు వరసలో ఉంది. అమెరికా ఆంక్షలను ధిక్కరించి భారత్... రష్యా నుంచి ఈ వ్యవస్థను కొనుగోలు చేసింది. భారత్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ రష్యా నుంచి ఐదు స్క్వాడ్రన్లను కొనుగోలు చేశాయి. 2026 నాటికి మరో రెండు స్క్వాడ్రన్లు అందుబాటులోకి రానున్నాయి. ఐదు ఎస్-400 స్క్వాడ్రన్‌ల కోసం రూ. 35 వేల కోట్ల ఒప్పందంపై 2018లో సంతకం చేసింది. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన దీర్ఘ శ్రేణి వాయు రక్షణ వ్యవస్థల్లో ఇది ఒకటి. ఐఏఎఫ్ కమాండ్ అండ్ కంట్రోల్ నెట్‌వర్క్‌తో అనుసంధానించబడిన ప్రతీ ఎస్-400 స్క్వాడ్రన్‌లో రెండు బ్యాటరీలు ఉంటాయి. ఒక్కొక్కటి ఆరు లాంచర్లను, అధునాతనమైన రాడార్లను కలిగి ఉంటుంది. ఒక్కో బ్యాటరీలో 128 క్షిపణుల మద్దతు ఉంటుంది. ఎస్-400 సుదర్శన్ 400 కి.మీ వరకు శత్రువులు ప్రయోగించే వైమానిక ముప్పులను ముందే పసిగట్టి, కౌంటర్ ఎటాక్ చేస్తుంది. ఇది స్టెల్త్ ఎయిర్ క్రాఫ్ట్, ఫైటర్ జెట్స్, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణుల్ని ట్రాక్ చేసి, మార్గం మధ్యలోనే కొట్టేస్తుంది. తాజాగా, పాకిస్థాన్ దాడిని ఎస్-400 వ్యవస్థ తిప్పికొట్టి తన సత్తాను మరోసారి నిరూపించుకుంది.

పాక్ దాడి చేస్తే మా సైన్యం ఊరుకోదు

ఇరాన్ మంత్రితో జైశంకర్

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రతరం చేయాలనే ఉద్దేశం భారతదేశానికి లేదని, కానీ తమ దేశంపై సైనిక దాడులు జరిపితే గట్టి సమాధానం ఇస్తామని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టంచేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఖ్చితో గురువారం జరిగిన సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడిని గుర్తుచేసిన ఆయన... భారత సరిహద్దు దాటి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై మాత్రమే దాడులు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ అంశంపై పొరుగు దేశం, సన్నిహిత భాగస్వామి అయిన ఇరాన్ ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమని జైశంకర్ అన్నారు. కాగా... భారతదేశం, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి నిన్న రాత్రి అర్ధరాత్రి న్యూఢిల్లీ చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన మన దేశంలోనే ఉన్నారు. మరోవైపు... భారత్-పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీకి వచ్చారు. ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్‌జుబైర్ గురువారం ఇక్కడికి వచ్చారు. ఆయన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది.

రాజస్థాన్‌లో పాక్ సరిహద్దు మూసివేత

పంజాబ్‌లో హైఅలర్ట్

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకొంటున్న రాష్ట్రాల్లో భద్రతా చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్ సరిహద్దును మూసివేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే... కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. భారత వాయుసేన కూడా పూర్తి అప్రమత్తంగా ఉంది. మే 9వ తేదీ వరకు జోధ్‌పూర్, బికనీర్, కిషన్‌ఘర్ విమానాశ్రయాలు మూసివేశారు. గగనతలంలో యుద్ధవిమానాల గస్తీ పెంచారు. ఇక్కడ క్షిపణి రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేశారు. ఇక పంజాబ్‌లో ప్రభుత్వం కీలక చర్యలు తీసుకొంది. సరిహద్దుల్లోని ఆరు జిల్లాల్లో పాఠశాలలు మూసివేసింది. వీటిల్లో ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫజ్లికా, అమృత్‌సర్, గురుదాస్‌పూర్, తార్న్ తరన్ ప్రాంతాల్లో 72 గంటలపాటు స్కూళ్లను మూసివేశారు. రాష్ట్ర పోలీస్‌శాఖ, ఇతర దళాల్లో సెలవులు రద్దు చేసి... సిబ్బంది తక్షణమే విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో గురువారం కూడా పాకిస్థాన్ దళాలు శతఘ్ని గుండ్ల కాలుస్తున్నాయి. మన సైన్యం దీటుగా బదులిస్తోంది. పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది.

చొరబాటుకు పాక్ జాతీయుడి యత్నం...

హతమార్చిన బీఎస్ఎఫ్

చండీగఢ్: పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో బుధవారం అర్ధరాత్రి పాకిస్థాన్ జాతీయుడు భారత్‌లోకి చొరబడేందుకు యత్నించాడు. చీకట్లో భారత భూభాగంవైపు దూసుకొచ్చాడు. ఇది గమనించి బీఎస్ఎఫ్ బలగాలు వెంటనే అతడిపై కాల్పులు జరపడంతో మృతి చెందాడు. అనంతరం అతడి మృతదేహాన్ని పోలీసులకు అప్పగించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్... ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి విరుచుకుపడింది. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఈ దాడిలో 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. భారత్ దాడితో రగిలిపోతున్న పాక్.. ప్రతిచర్యగా భారత్‌పై ఏక్షణమైనా దాడులు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో భారత్ సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు సిబ్బంది సెలవులను రద్దు చేశాయి. బహిరంగ సభలపై నిషేధం విధించాయి. పాక్‌తో రెండు రాష్ట్రాల సరిహద్దులను పూర్తిగా మూసివేశారు. సరిహద్దు వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే కాల్పులు జరపాలని భద్రతా దళాలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

గ్యాస్ సిలిండర్ పేలి 8 మంది దుర్మరణం

జైపూర్: బంగారం దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలి ఎనిమిది మంది దుర్మరణం చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రాజస్థాన్ రాష్ట్రం బికనీర్ జిల్లా మదన్ మార్కెట్ ప్రాంతంలో జరిగింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిలిండర్ పేలుడు ధాటికి ఆ దుకాణం ఉన్న భవనం ధ్వంసమైంది. బంగారం దుకాణంలోని గ్యాస్ స్టవ్‌పై పాత బంగారం, వెండిని కరిగించేందుకు మరగబెడుతుండగా ఒక్కసారిగా సిలిండర్ పేలిపోయిందని పోలీసులు తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

డిఆర్‌డిఏ పీడీ శ్రీలతకు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సేర్ఫ్) ద్వారా అమలు చేస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను రంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాలకు 112 శాతం అందించినందుకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకున్నారు. గురువారం తెలంగాణ ప్రజాభవన్‌లో నిర్వహించిన 2025 -26 ఆర్థిక సంవత్సర బ్యాంకు లింకేజీల లక్ష్యాలను మరియు వార్షిక ప్రణాళికను పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్ (సేర్ఫ్) సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి మంత్రి ప్రారంభించడం జరిగింది. రంగారెడ్డి జిల్లాలో గత 2024 -25 ఆర్థిక సంవత్సరం నాటికి 15,571 సంఘాలకు 850 కోట్ల 42 లక్షల టార్గెట్‌ను 959 కోట్లు 18 లక్షల 112 శాతం చేదించినందుకు ఈ అవార్డు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి బ్యాంక్ అధికారులు అడిషనల్ డిఆర్‌డిఓ సూర్యారావు డిపిఎం బాలరాజు, ఏపీఎంలు సత్యనారాయణ, యాదగిరి, జిల్లా సమాఖ్య కార్యదర్శి కవిత, సిసి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌ల పరిశీలన

విశాలాంధ్ర - హైదరాబాద్ : మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌లను ఎం.ఆర్.డి.సి.ఎల్ ఎండి ఈ.వీ నరసింహారెడ్డి అధికారుల బృందంతో కలిసి గురువారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రిజర్వాయర్ల స్టోరేజ్ సామర్థ్యం, అందులోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోకు సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. అనంతరం మూసీలోకి మంచినీటి విడుదల, దానికి సంబంధించి ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో నరసింహారెడ్డి సమగ్రంగా చర్చించడం జరిగింది. మూసీ, ఈసా నదుల పొడవునా బాపూఘాట్ వరకు విస్తరించి ఉన్న ప్రాంతానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ ఎండీ గౌతమి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్ దత్తుపంత్, మెయిన్‌హార్ట్ కన్సల్టెంట్స్, హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి. సూపరింటెండెంట్ ఇంజినీర్ బ్రిజేశ్ పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

5 నుంచి 17వరకు మీ సేవా కేంద్రాల్లో స్వీకరణ

ఇంటర్‌లో గణితం నుంచి బీటెక్ సివిల్ వరకు అర్హత

విశాలాంధ్ర - హైదరాబాద్ : భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి (భూ హక్కుల రికార్డు) చట్టం-2025ను ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ పరిపాలనకు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగం సహాయంగా, రాష్ట్రంలోని దాదాపు 5000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని యోచిస్తోందని, లైసెన్సుడు సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ (తాలిమ్) దరఖాస్తులను ఆహ్వానించిందని, ఈనెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని మీసేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మీసేవా కేంద్రాల్లోనే ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్‌లో గణితంతో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్ మెన్ (సివిల్) డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో 26 మే నుండి జులై 26 వరకు 50 పని దినాల్లో శిక్షణ ఇవ్వబడుతుందని, ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

తప్పుడు పరిశోధనలతో నిధుల దుర్వినియోగం

సెంటెగ్రో స్వచ్ఛంద సంస్థ ఆరోపణ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : హైదరాబాద్ నగరంలోని ఐసీఎంఆర్ - ఎన్ఐఎన్‌లో పురుగుమందుల అవశేషాల విశ్లేషణ విషయంలో భారీ శాస్త్రీయ మోసం, నిధుల దుర్వినియోగం జరిగాయని ముంబైకి చెందిన సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ అగ్రికల్చర్ (సెంటెగ్రో) అనే స్వచ్ఛంద సంస్థ ఆరోపించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు ఏడాదికి దాదాపు రూ.4 వేల కోట్ల బడ్జెట్ ఉంటుంది. ఈ ఐసీఎంఆర్ పరిధిలో పనిచేసే హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ - ఎన్ఐఎన్). సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారం ప్రకారం, ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎన్. సిన్హా (ఫోన్ నెం.040-27197405), జూనియర్ శాస్త్రవేత్త దిలేశ్వర్ కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన బూటకపు పరిశోధన వివరాలు తెలిశాయి. దిలేశ్వర్ కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆర్గానోఫాస్ఫేట్ క్రిమిసంహారక మందుల ప్రభావానికి గురైన మొక్కల న్యూరోబిహేవియరల్, బయోజెనిక్ అమైన్ల వ్యక్తీకరణలపై పరిశోధన చేయడానికి డాక్టర్ ఎస్ఎన్ సిన్హాకు ఐసీఎంఆర్ రూ 41.47 లక్షలు కేటాయించింది. ఈ మొత్తాన్ని ఉపయోగించి డాక్టర్ ఎస్.ఎన్.సిన్హా, దిలేశ్వర్ కుమార్ 6 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. అయితే ఆ పత్రాలు నకిలీ, తప్పుడు సమాచారంతో నిండి ఉన్నాయని సెంటెగ్రో కనుగొంది. ఈ నివేదికలు ప్రాథమిక పరిశీలనకు కూడా నిలబడవని, విశ్వవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన శాస్త్రీయ నియమాలు, సూత్రాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని సెంటెగ్రో బలమైన సాక్ష్యాలను అందించింది. ఆశ్చర్యకరంగా ఐసీఎంఆర్ (ఢిల్లీ), ఎన్ఐఎన్ (హైదరాబాద్), ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాద్) ఈ మోసానికి సంబంధించి పక్కా ఆధారాలను పరిశీలించిన తర్వాత కూడా మౌనం దాల్చాయి. ఎన్ఐఎన్ మాత్రం తాను ప్రచురించిన ఆరు పరిశోధక పత్రాల్లో ఒకదాన్ని ఉపసంహరించుకుంది.

18న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభం

సచివాలయంలో పథకంపై ఉన్నత అధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈనెల 18వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అచ్చంపేట నియోజకవర్గం మన్ననూరులో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నత అధికారులతో సమీక్షించారు. గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు, గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.12,600 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకం ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్తు మంత్రి మండలి పాల్గొంటారని తెలిపారు. ఇందు కోసం అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని దానిని అమలు చేసే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. రానున్న ఐదు సంవత్సరాలలో రెండు లక్షల పది వేల మంది రైతులకు సంబంధించిన ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఇందిరా సౌర గిరి జలవికాసం పథకం ఉపయోగపడుతుందన్నారు. అడవిలో పోడు భూముల సాగుకు కావలసిన విద్యుత్తు సరఫరాకు అటవీశాఖ అనుమతి నిరాకరించడంతో దశాబ్దాల తరబడి నిరీక్షిస్తున్న గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా గిరి జిల్లా వికాసం పథకం ఒక వరం లాంటిదన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఏకకాలంలో గిరిజనులు పోడు భూములు సాగు చేసుకోవడానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించలేదని అన్నారు. ఈ పథకం అమలులో ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్లు, విద్యుత్తు, ఉద్యాన వన శాఖ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. పట్టాలు పొందిన గిరిజనుల గ్రామాలను ఎంపిక చేసి ఆ గ్రామాల్లోని భూముల్లో జల వనరుల లభ్యత కోసం జియాలజికల్ సర్వే, తదుపరి బోర్లు వేయడం, సోలార్ పంపు సెట్లు బిగించడం, ప్లాంటేషన్, డ్రిప్ ఏర్పాటు చేయించి గిరిజన రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. అవకాడో, వెదురు, దానిమ్మ డ్రాగన్ ఫ్రూట్ అంజీర్ వంటి పంటలు గిరిజనులు సాగు చేసేందుకు కార్యచరణ రూపొందించుకొని గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పంటల సాగు జరుగుతున్న తీరుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించేందుకు స్టడీ టూర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పామాయిల్, వెదురు వంటి పంటలు చేతికి రావాలంటే కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుందని, ఈలోపు గిరిజనులకు ఆదాయం సమకూరేందుకు అవసరమైన అంతర పంటల సాగును గుర్తించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. హిమాచల్ ప్రదేశ్లో న్యాచురల్ ఫామింగ్ ద్వారా ఆర్గానిక్ కూరగాయలను పండిరచి ఢల్లీకి ఎక్స్పోర్ట్ చేస్తున్న మాదిరిగా ఐటిడిఏ ప్రాజెక్టు పరిధిలోని ఏజెన్సీ ఏరియాల్లో ఇదే తరహాలో కూరగాయలను పండిరచి హైదరాబాదుకు ఎక్స్పోర్ట్ చేసే విధంగా కూరగాయల సాగుపై గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. స్టేట్ లెవెల్ మానిటరింగ్ కమిటీ, డిస్టిక్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కం పర్చేజ్ కమిటీ, ప్రత్యేకంగా పోర్టల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అడవిలో సాగు నీటి వసతి, కరెంటు సౌకర్యం లేకుండా దశాబ్దాల తరబడి పంటలు పండిరచుకోవడానికి నిరీక్షిస్తున్న గిరిజన రైతులు ప్రభుత్వం తీసుకొస్తున్న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ఉప ముఖ్యమంత్రి కి వివరించారు. ఈసమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అగ్రికల్చర్ సెక్రటరీ రఘునందన్ రావు, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎస్పీడిసీఎల్ సీఎండి.ముషారఫ్ ఫరూకి, ఎన్పీడీసీఎల్ సీఎండి.వరుణ్ రెడ్డి, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కష్ట పడి కాక ఇష్టపడి చదవాలని మల్కాజిగిరి శాశన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను బిఆర్ఎస్ నాయకులు ఏ.కె.మురుగేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రాబెల్స్ స్కూల్ ఆవరణలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి శాశన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. బట్టీ చదువులకు స్వస్తి చెప్పాలన్నారు. ఈ కార్యక్రంలో ఎంఈఓ సురేష్, మల్లికార్జున్, రావుల అంజయ్య, జె.ఏ.సి. పుల్ల వెంకన్న, రాము యాదవ్, కేబుల్ రమేష్, సిక్కా ప్రభాకర్, ఉపేందర్, నర్సింగ్ శ్రీకాంత్ యాదవ్, పిట్ల శ్రీనివాస్, జంగా రాజు, వెంకట్, ఉమాపతి, లక్ష్మి, సాయి గౌడ్, సుమన్ ఓం రాజు, బాబూరావు, విష్ణు, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాలపై సర్వే చేయండి

కమిషనర్ ఆర్‌వి కర్ణన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రానున్న వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శితిలావస్థలో గల, ప్రమాదకర భవనాలు, కట్టడాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రత్యేక సర్వేలు నిర్వహించి శిథిల భవనాలు, కట్టడాలు, పాత ప్రహరీ గోడలు మొదలైన వాటిని గుర్తించాలని, గుర్తించిన భవనాలపై ఇంజనీరింగ్ విభాగం నివేదిక ఆధారంగా నిర్మాణ భద్రతను అంచనా వేయాలని సూచించారు. ప్రతి సర్కిల్ స్థాయిలో నివేదిక ప్రకారం తుది జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. శిథిలావస్థలో గల ప్రభుత్వ పాఠశాల భవనాలు గుర్తిస్తే, తక్షణమే విద్యా శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. గుర్తించిన శిథిలావస్థ భవనాలకు నోటీసులు జారీ చేయాలని, అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాలను తక్షణమే ఖాళీ చేయించడం లేదా సీల్ వేయాలని, భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

భవన యజమానులు మరమ్మత్తులు చేపడితే, అవి జీహెచ్ఎంసి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నయో లేదో నిర్ధారించాలని, శిథిల భవనాల కూల్చివేతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రతి భవనం వివరాలను గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో అప్‌డేట్ చేయాలని, నివేదికను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. అన్ని సర్కిళ్ల డిప్యూటీ సిటీ ప్లానర్లు / అసిస్టెంట్ సిటీ ప్లానర్ లు తక్షణమే చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిర్మాణ స్థిరత్వం, పటిష్టత పై నివేదిక అందజేయాలని, జోనల్ కమిషనర్లు తమ సర్కిళ్లలో ఈ ప్రక్రియను సమీక్షించి నిర్దేశిత గడువులో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిధిలావస్థ భవనాలు స్ట్రక్చర్ల పై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం/ జాప్యం చేసినట్లయితే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు.

నూతన జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్‌గా నూతనంగా నియమింపబడిన హేమంత్ భోర్కడేని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడేతో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చించారు. గచ్చిబౌలి డివిజన్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అసంపూర్ణంగా ఉన్న పనులను తక్షణమే పునఃప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాలని కమిషనర్‌ని కోరారు. ముఖ్యంగా చెరువుల అభివృద్ధి, పార్కుల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు మెరుగుపరచడంలో సమన్వయంతో పనిచేయాలని కోరుతూ, అభివృద్ధి పట్ల సంకల్పంతో ముందుకెళ్లే దిశగా కమిషనర్‌తో పరస్పర సహకారం కొనసాగించాలని పేర్కొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుల మృతి

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌లో గల పవర్ ప్లాంట్ ఫేస్-2 చిమ్నీ వద్ద బుధవారం లిఫ్ట్ తెగిపడటంతో ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులు సురేష్ సర్కార్ (21), ప్రకాష్ మండల్ (24), అమిత్రాయ్ (20) ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన కార్మికుల భద్రతను పట్టించుకోని యాజమాన్యం నిర్లక్ష్యం వెల్లడిస్తోంది. ఘటన స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన కెవిఆర్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు డి.జి.నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.చంద్రశేఖర్ తదితరుల బృందాన్ని యాజమాన్యం లోపలికి అనుమతించకపోవడం, పట్ల యాజమాని చర్యను ఖండించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కాంట్రాక్ట్ కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షల నష్ట పరిహారం చెల్లించి, ప్రతి కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలన్నారు. పరిశ్రమల ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరిపించి, టెక్నికల్ పనులు అర్హతలేని కాంట్రాక్ట్ కార్మికుల చేత చేయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వలస కార్మికుల హక్కులు కాపాడుతూ, చట్టప్రకారం రిజిస్టర్ మెయింటెన్ చేయాలన్నారు. యాజమాన్యం బాధ్యత గల వైఖరిని తీసుకోకపోతే మైగ్రేట్ కార్మికులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆపాలని, మానవత్వంతో వ్యవహరించాలని కోరింది. ఈ కార్యక్రమంలో కేవిఆర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.చంద్రశేఖర్, మేడ్చల్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎర్ర అశోక్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భాదితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పిజేఆర్ నగర్ నివాసి అనారోగ్యం కారణంగా హాస్పిటల్‌లో చికిత్స పొందిన అనంతరం శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ కార్యాలయాన్ని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించి, ఈరోజు వారికి మంజూరు అయిన రూ.60,000ల చెక్కును నియోజకవర్గ నాయకులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ బాధితురాలికి అందచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, నాయకులు పట్వారీ శశిధర్, సంగమేష్, ముజీబ్, సుధాకర్, రత్నం, కిరణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీలకు అంతా సిద్ధం

ఓల్డ్ బస్తీలో మిస్ వరల్డ్ ప్రతినిధుల హెరిటేజ్ వాక్

రేపు సాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి హైదరాబాద్ ముస్తాబైంది. శనివారం సాయంత్రం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు అధికారికంగా మొదలవుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఎయిర్ పోర్టుతో సహా హైదరాబాద్ నగరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ ఏర్పాట్లన్నీ దాదాపు తుదిదశకు చేరుకున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి ఇప్పటికే 109 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీ దారులు హైదరాబాద్ చేరుకున్నారు. మరికొంత మంది ప్రతినిధులు వివిధ దేశాల నుంచి రానున్న రెండు రోజుల్లో వస్తారని మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు. వీరికి తోడు 28 మంది మిస్ వరల్డ్ సంస్థ నుంచి నిర్వహణ ప్రతినిధులు, 17 మంది సహాయకులు వచ్చారు. గత వారం రోజులుగా వస్తున్నఅతిధులు అందరినీ తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా స్వాగతం పలుకుతూ వారికి బస ఏర్పాట్లను టూరిజం శాఖ కల్పించింది. విదేశీ ప్రతినిధులు బస చేసిన ట్రిడెంట్ హోటల్ దగ్గర పోలీసులు భారీ భద్రత కల్పించారు. ఈ కంటెస్టంట్లు రిహార్సల్స్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పోటీదారులను వివిధ గ్రూపులుగా ఏర్పాటు చేసి వారు పాల్గొనబోయే కార్యక్రమాల బ్రీఫింగ్ నిర్వాహకులు చేస్తున్నారు. వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్లు విభిన్న కార్యక్రమాలు, తెలంగాణలో ఉన్న చారిత్రక, పర్యాటక ప్రదేశాల సందర్శనలో పాల్గొంటారు. ఏర్పాట్లపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి, పర్యావరణ పరంగా అన్నిహంగులు ఉన్నా, తెలంగాణ ఆరంగంలో వెనుకబడిరదని, ఇకపై తెలంగాణ జరూర్ ఆనా అనే నినాదాన్ని విస్తృతంగా ప్రపంచవ్యాప్తంగా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా పర్యాటకరంగం పెరగటం, పెట్టుబడుల సాధన, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఈవెంట్ గురించి రాష్ట్ర ప్రభుత్వం దేశ విదేశాలతో పాటు అన్ని రాష్ట్రాల ప్రధాన ఏర్పోర్ పోర్టుల్లో ప్రచారం కల్పిస్తుంది.

ఓల్డ్ సిటీలో..మిస్ వరల్డ్ ప్రతినిధుల హెరిటేజ్ వాక్...

చార్మినార్, లాడ్ బజార్‌లకు గ్లోబల్ ఎక్స్పోజర్ హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ ఈవెంట్‌తో చార్మినార్, లాడ్ బజార్‌లకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కనుంది. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈ నెల13న సాయంత్రం హైదరాబాద్ నగరంలోని చార్మినార్, లాడ్ బజార్ లలో హైదరాబాద్‌తో పాటు చార్మినార్, లాడ్ బజార్ సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేలా హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. లాడ్ బజార్‌లో మిస్ వరల్డ్ ప్రతినిధులు స్థానిక కళాకారులతో మాట్లాడనున్నారు. 120 దేశాల మిస్ వరల్డ్ ప్రతినిధులు హాజరయ్యే ఈ హెరిటేజ్ వాక్‌ను 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ ఈవెంట్‌ను తిలకిస్తారు. చారిత్రక చార్మినార్ కట్టడం, లాడ్ బజార్ ప్రత్యేకతలను మిస్ వరల్డ్ ప్రతినిధులు వివరించి వరల్డ్ టూరిస్ట్ డెస్టినేషన్ స్పాట్ గా ప్రమోట్ చేయనున్నారు. నిజాం పాలనలో వెలసినలాడ్ బజార్‌కు 400 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. బాంగిల్స్ రాజధానిగా ఈ ప్రాంతం సుప్రసిద్ధం. రంగురంగుల పేర్లు, మణులు, జరీ పనితో కూడిన సాంప్రదాయిక గాజులు ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ నాణ్యమైన ముత్యాలు, నగలు సరసమైన ధరల్లో లభిస్తాయి. హస్తకళల హబ్‌గా కూడా పేరుంది. చిత్రకళ, నకాశీ పని, ఇస్లామిక్ ఆర్ట్ వంటి సాంప్రదాయిక హస్తశిల్ప వస్తువులు ఇక్కడ లభిస్తాయి. ఇత్తార్ (సువాసనలు), ఖురాన్ ప్రతులు, సాంస్కృతిక వస్తువులతో ఇది ఇస్లామిక్ ఆర్ట్‌కి ప్రతీకగా ఉంది. ఓల్డ్ సిటీ యొక్క ఇటుకల రోడ్లు, సజీవమైన దుకాణాలు, సాంస్కృతిక సువాసనలు ప్రతి ఒక్కరినీ ముగ్ధలను చేస్తాయి. 1591లో కుతుబ్ షాహీ రాజు ముహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించిన చార్మినార్, హైదరాబాద్ సాంస్కృతిక గర్వాన్ని ప్రతిబింబిస్తుంది. నాలుగుమినార్లతో కూడిన ఈ స్మారకం ఇండో-ఇస్లామిక్ డిజైన్‌కు నిదర్శనం. ప్లేగు నివారణ తర్వాత నగర స్థాపనకు గుర్తుగా నిర్మించబడిరది. 56 మీటర్ల ఎత్తు, 45 మీటర్ల వెడల్పుతో ఇది హైదరాబాద్ కు "హార్ట్" గా ఉంది. మినార్లపై నుంచి పాతనగరం, మక్కా మసీదు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి. ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు కోసం ప్రతిపాదించబడిరది. ఇది నిజాం కాలం నుంచి నేటి వరకు హైదరాబాద్ ఐకాన్‌గా ఉంది.

ఇప్పటివరకు హైదరాబాద్‌కు చేరుకున్న 109 దేశాల ప్రతినిధులు...

72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో భాగంగా ఇప్పటివరకు 109 దేశాల నుండి కంటెస్టెంట్స్ నగరానికి చేరుకున్నారు. ఇతర దేశాల నుండి పోటీదారుల ఇంకా వచ్చే అవకాశముంది. శుక్రవారంలోగా మొత్తం అభ్యర్థులు నగరానికి చేరుకుంటారు. భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తాతో పాటు, అథెన్నా క్రాస్బీ (అమెరికా), ఎమ్మా మోరిసన్ (కెనడా), వాలేరియా కాన్యావో (వెనిజులా) వంటి ప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. అమెరికా, దక్షిణాఫ్రికా, వెనిజులా వంటి ప్రముఖ దేశాలతో పాటు గ్వాడలూప్, గిబ్రాల్టర్, మార్టినిక్, క్యురాకావ్ వంటి చిన్న దేశాల నుంచి కూడా ప్రతినిధులు పాల్గొనడం విశేషం. విద్యార్థులు, డాక్టర్లు, న్యాయవాదులు, సామాజిక వేత్తలు, కళాకారులు, ఉద్యమకారులుగా ఉన్న పోటీదారులు తమ దేశాల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పోటీదారులు దాదాపు నెల రోజులపాటు తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక, సాంస్కృతిక, వైద్య, చేనేత, ఆవిష్కరణ కేంద్రాలను సందర్శించనున్నారు. గత ఏడాది ముంబయిలో మిస్ వరల్డ్ ఈవెంట్ జరగగా, ఈ ఏడాది మే 31న హైదరాబాద్, హైటెక్స్ వేదికగా గ్రాండ్ ఫినాలే జరగనుంది. మిస్ వరల్డ్ పోటీలను వరుసగా రెండేళ్ల పాటు భారత్ లో నిర్వహించడం తొలిసారి. ఈ అరుదైన గౌరవం దేశానికి మాత్రమే కాదు, తెలంగాణకు కూడా విశ్వవేదికపై విశిష్ట గుర్తింపునిస్తుంది.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారికి

నియామక పత్రాలు అందజేసిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీ వెల్ఫేర్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన 121 మంది అభ్యర్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య వసతి అందించడానికి విశేష కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియామకంలో కీలకమైన అడుగు వేసిందన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నాణ్యమైన విద్య, వసతి సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించిందని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ను ఎంపిక చేసి వాళ్ళకు నియామక పత్రాలు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. హాస్టల్‌లో ఉండే పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని, ప్రస్తుతం బీసీ వెల్ఫేర్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 లో ఉన్నవారు 485

మంది. కాగా టీజీపీఎస్సీ ద్వారా నూట నలభై పోస్టులు శాంక్షన్ చేయగా వారికి పరీక్ష నిర్వహించి ఎంపిక చేశారన్నారు. 132 మందిలో గురువారం 121 మందికి నియామక పత్రాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. 11 మంది అభ్యర్థులు వివిధ కారణాల వల్ల హాజరు కాలేకపోయారు. బీసీ సంక్షేమ శాఖలో పని చేస్తున్న మొత్తం హాస్టల్స్ 703. ఇందులో ప్రీ మెట్రిక్ హాస్టల్స్ 390, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ 313. ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో 32,161 మంది, పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో 40,639 మంది విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 1330 రూపాయలు, 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు 1540 ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లిస్తుంది. అదే విధంగా పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నెలకు 2000 రూపాయలను కేటాయించింది. భోజన వసతి సదుపాయాలతో పాటు ప్రతి విద్యార్థి బెడ్ షీట్స్, కార్పెట్, యూనిఫామ్, లాంగ్ అండ్ షార్ట్ నోట్ బుక్స్, రికార్డ్ బుక్స్, గ్రాఫ్ బుక్స్ అందిస్తున్నారు.

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి మృతికి నివాళి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ఉప్పల్ శాశన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి (78) కన్నుమూశారు. కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు బండారి రాజిరెడ్డి పని చేశారు. ఆయన పార్థివ దేహానికి ఘనంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నివాళులు అర్పించారు. గత కొత్త కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజిరెడ్డి గురువారం తెల్లవారుజామున హబ్సిగూడలో ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాజి రెడ్డి అంత్యక్రియలు శుక్ర వారం జరగనున్నాయి. హబ్సిగూడ నుంచి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలియజేశారు. బండారి రాజిరెడ్డి 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఉప్పల్ శాసన సభ్యులుగా పోటీ చేసి టిఆర్ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై గెలిచారు. ఆయన ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించే మంచి మనసున్న మనిషిగా పేరు గడించారు. రాజకీయ నాయకులకు నైతిక విలువలతో కూడి ఉన్న స్వభావంతో ఉండాలని, నిస్వార్థంతో ప్రజలకు సేవ చేయాలని ఆయన భావించేవారు.

వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ మెడల్ ఆఫ్ ఆనర్ గౌరవం పొందిన భువన్ రిభు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : భారతదేశ న్యాయ రంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా, ప్రముఖ బాలల హక్కుల న్యాయవాది భువన్ రిభు, వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ నుండి 'మెడల్ ఆఫ్ ఆనర్' పొందిన మొట్టమొదటి భారతీయ న్యాయవాది గా నిలిచారు. మే 4 నుండి మే 6 వరకు డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన వరల్డ్ లా కాంగ్రెస్‌లో 70 దేశాల నుండి వచ్చిన 1500కు పైగా న్యాయ నిపుణులు, 300 ప్రసంగకర్తల సమక్షంలో ఈ గౌరవం అందించబడింది. రెండు దశాబ్దాలుగా న్యాయ పరమైన జోక్యం, అట్టడుగు స్థాయిలో చైతన్యాన్ని ఉపయోగించి బాలల రక్షణ కోసం చేసిన పనికి ఈ గౌరవం లభించింది. ప్రపంచంలోనే అతి పురాతన ప్రభావవంతమైన న్యాయ మూర్తులు, న్యాయవాదులు, న్యాయ పండితుల నెట్‌వర్క్ వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ 1963 లో స్థాపించబడింది. గతంలో సర్ విన్స్టన్ చర్చిల్, నెల్సన్ మాండేలా, రూత్ బేడర్ గిన్స్‌బర్గ్, స్పెయిన్ రాజు ఫెలిప్ -6, రెనె కాసిన్, కెర్రీ కెన్నడీలకు ఈ గౌరవాన్ని అందించింది. గత 20 ఏళ్లలో భువన్ రిభు 60 పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్లు దాఖలు చేసి, భారత సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల్లో చారిత్రక తీర్పులను పొందారు. తెలంగాణలోని 25 జిల్లాల్లో బాలల రక్షణ, బాల్య వివాహ నిర్మూలన కోసం 10 ఎన్జీఓలతో కలిసి జస్ట రైట్స్ ఫర్ చిల్డ్రన్ పనిచేస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21) ప్రకారం రాష్ట్రంలో బాల్య వివాహాల పరిస్థితి తీవ్రంగా, 23.5%, ఉంది. అవార్డు స్వీకార సమయంలో భువన్ రిభు మాట్లాడుతూ, బాలలు న్యాయం కోసం ఒంటరిగా పోరాడకూడదు. చట్టం వారికి రక్షణ కవచంగా ఉండాలి, న్యాయం వారి హక్కుగా ఉండాలి అని అన్నారు. ఈ గౌరవాన్ని డొమినికన్ రిపబ్లిక్ కార్మిక శాఖ మంత్రి ఎడీ ఒలివారెస్ ఓర్టేగా వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు జావియర్ క్రెమాడెస్ అందించారు. మహిళా మంత్రి మైరా జిమెనెజ్ కూడా కార్యక్రమంలో హాజరయ్యారు.

ఉత్తమ అధికారులకు అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో - ములుగు జిల్లా : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో పేదరికం నిర్మూలించ డానికి ఏర్పాటు చేసిన సొసైటీలో ఉత్తమ పని తీరును కనపరిచిన ములుగు జిల్లా సెర్ప్ అధికారులకు ప్రభుత్వం అవార్డు అందజేసింది. గురువారం హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ఇన్చార్జి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, డిఆర్డిఏ ప్రాజెక్టు అధికారిసంపత్‌రావు అవార్డు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు 2024 ఆర్థిక సంవత్సరంలో 226 కోట్లకు గాను 235 కోట్లను అందించేందుకు గాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు అందించడం జరిగిందన్నారు. ఎస్‌హెచ్‌జి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సంబంధిత అధికారులు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సర్ప్ సీఈవో డి.దివ్య, ములుగు జిల్లా అదనపు డిఆర్డిఓ జి. బాలస్వామి, జిల్లాలోని ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు.

పేలిన మందుపాతర : ముగ్గురు పోలీసులు మృతి

విశాలాంధ్ర బ్యూరో - ములుగుజిల్లా : ములుగుజిల్లా వాజేడు, పేరూరు వీరభద్రారం తడపాల గుట్టలో, పోలీస్‌లు ఆడవుల్లో, సాధారణంగా తనిఖీ చేస్తుండగా, మావోయిస్టు ల్యాండ్ మైన్స్ పేల్చి ముగ్గురు పోలీస్‌లను హతమార్చారు. మరో ముగ్గురు పోలీసులకు గాయాలు అయిన్నట్లు సమాచారం తెలుస్తుంది. అదికారికంగా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్న

భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: పాకిస్తాన్ భూభాగంలో బహుళ ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసిన భారత త్రివిధ దళాల ధైర్యానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ వందనలు చెప్పారు. దళాల ధైర్యం ప్రతి భారత పౌరుడి విశ్వాసం ఆపరేషన్ "సిందూర్" విజయం అని అన్నారు. హైదరాబాద్, ట్యాంక్ బండ్ అంబెడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ భారత సాయుధ దళాలకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించింది. ఉగ్రవాదం నిర్మూలించాలి, పాకిస్థాన్ నశించాలి, భారత్ మాతాకీ జై అంటూ ఆప్ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ పాకిస్తాన్‌లో పనిచేస్తున్న ఉగ్రవాద కర్మాగారాలను అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చేర్యలకు ఆప్ పూర్తి మద్దతు తెలుపుతుందని తెలిపారు. భారతదేశంలో ఉగ్రవాద దాడులను అమలు చేయడంలో పాల్గొన్న జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా అగ్ర నాయకులను నిర్మూలించే ఉద్దేశ్యంతో ఆపరేషన్ "సిందూర్" పేరుతో భారత దళాలు లక్ష్యాలను చేరుకోవడం గొప్ప విజయమన్నారు. అత్యంత ముఖ్యమైన జాతీయ భద్రతపై ఎటువంటి రాజీ పడొద్దని, కేంద్ర ప్రభుత్వంతో రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ నిలబడాలని విజ్ఞప్తి అయన విజ్ఞప్తి చేసారు. భారత సైన్యం ఆపరేషన్ "సిందూర్"ను ప్రారంభించడం వల్ల పహల్గామ్ దాడి బాధితులకు న్యాయం జరిగిందన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్న భారతదేశానికి ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని, ఉగ్రవాద స్థావరాలను, ఉగ్రవాదులను నాశనం చేయడానికి అన్ని దేశాలు భారతదేశంతో చేతులు కలపి ప్రపంచంలో శాంతియుత వాతావరణం సృష్టించడానికి బలంగా కృషి చేయాలనీ డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు జావీద్ షరీఫ్, డా. లక్ష్మ నాయుడు, సుధారాణి, అజీజ్ బేగ్, షాబాజ్, సిద్దార్థ్, ఎస్.ఎన్.రెడ్డి, రమ్య గౌడ్, విశాలి, లియాఖత్ ఖాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా పయనిస్తున్న సత్వ సుకున్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : అరోమా, గృహ అలంకరణ ఉత్పత్తుల ప్రముఖ తయారీదారు సత్వా సుకున్ లైఫ్కేర్ లిమిటెడ్ 2025 మార్చి 31 తో ముగిసిన నాల్గవ త్రైమాసికం, పన్నెండు నెలల ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. 2025 మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.48.19 లక్షల నుంచి 74.5 శాతం పెరిగి రూ.84.22 లక్షలకు చేరుకుంది. 2025 మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.99.23 లక్షల నుంచి 6 శాతం పెరిగి రూ.105.16 లక్షలకు చేరుకుంది. 2025 మార్చి 31తో ముగిసిన పన్నెండు నెలల్లో కంపెనీ నికర లాభం రూ.119.04 లక్షల నుంచి 108.9 శాతం పెరిగి రూ.248.94 లక్షలకు చేరుకుంది. 2025 మార్చి 31తో ముగిసిన పన్నెండు నెలల్లో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.355.33 లక్షల నుంచి 48.1 శాతం పెరిగి రూ.526.30 లక్షలకు చేరుకుంది. ఇన్నోవేషన్ ఆధారిత ఉత్పత్తి అభివృద్ధి, తయారీ సామర్థ్యాల్లో పెట్టుబడులు, విస్తరిస్తున్న వినియోగదారుల బేస్ కలయికతో కంపెనీ విజయం సాధించిందని, సుస్థిర దీర్ఘకాలిక వృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఈ బలమైన పనితీరు సత్వా సుకున్ ఎక్సలెన్స్ పట్ల నిబద్ధతను, మార్కెట్ పోకడలకు అనుగుణంగా పరిశ్రమలో కీలకపాత్రను మరింత ధృవీకరిస్తుంది అని సత్వా సుకున్ లైఫ్ కేర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంబిటి తరుణ్ కుమార్ బ్రహ్మభట్ అన్నారు.

రాజీవ్ యువ వికాసం పథక అమలుకు

సిబిల్ స్కోర్ తప్పనిసరి నిబంధనను తొలగించాలి

వినూత్నంగా చెవిలో పూలు, చేతిలో చిప్పతో నిరసన

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌ను కీలకం చేయడం సరికాదని, సిబిల్ స్కోర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్య నారాయణ రెడ్డి భవన్ నుండి వై జంక్షన్ వరకు చెవిలో పూలు, చేతిలో చిప్ప పట్టుకుని వినూత్నంగా నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పిందని, రాష్ట్రంలోని 16.25 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇప్పుడు కొత్తగా సిబిల్ స్కోర్ తప్పకుండ ఉండాలనే నిబంధనతో లక్షల మంది యువతను ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఏవైనా లోన్లు తీసుకుని కట్టనివారి అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యే అవకాశం ఉందని, దరఖాస్తుదారుల లోన్ హిస్టరీ, సిబిల్ స్కోర్ వివరాలను బ్యాంకుల నుంచి సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వాటి ఆధారంగా 40శాతం అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యే అవకాశముందన్నారు. ఉపాధి లేకపోవడం వల్లనే యువత ప్రైవేట్ లోన్స్, బెట్టింగ్ ఇతర యాప్స్‌ల రూపంలో అప్పులు తీసుకుంటున్నారనీ, ఇలాంటి వారికి సీబిల్ స్కోర్ తగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీబిల్ స్కోర్ ఆలోచన విధానాన్ని విరమించు కోవాలన్నారు. ఎటువంటి నిబంధనలు పెట్టకుండా అందరికి ఉపాధి కల్పనకు ఈ స్కీమ్ ద్వారా డబ్బులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఈ నిబంధనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ తన ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన నిరుద్యోగ భృతి అమలు హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించారని వారు ధ్వజమెత్తారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, హేమంత్, జానీ, వెంకట్, ఖాజా పాషా, సతీశ్ కుమార్, జగన్ సీపీఐ హైదరాబాద్ జిల్లా నాయకులు చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జిగా దారెడ్డి అభినవ్ రెడ్డి

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దారెడ్డి అభినవ్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఇదే నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో ఇంచార్జ్ పదవికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఎల్బీ నగర్ నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలని పర్యవేక్షించడానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలోకి తీసుకుపో వడానికి ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి ఉపాధ్యక్షులు దయాసాగర్ రెడ్డి జిల్లా ఇంచార్జులు రాంరెడ్డి,అరవింద్ లకు ధన్యవాదాలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా క్యామ రాజేష్

యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇంచార్జ్‌గా కడ్తాల్ పట్టణానికి చెందిన క్యామ రాజేష్ నియామకం అయ్యారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జులు రామ్ రెడ్డి, అరవింద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్‌గా నియమితులైన క్యామ రాజేష్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జ్‌గా నియామకానికి ప్రోత్సహించి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు యూత్ కాంగ్రెస్ పార్టీ మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మరియు యూత్ కాంగ్రెస్ నాయకుల సహకారంతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. అన్ని వర్గాల యువత సమస్యలను పరిష్కరిస్తు వారిని ఏఐసిసి నాయకులు లోకసభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఆలోచనల వైపు మళ్లించేందుకు పనిచేస్తానని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళి అర్హులైన లబ్దిదారులందరికీ ఆరు గ్యారంటీల పథకాలు అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో యువతకు గొప్ప భవిష్యత్ ఉందని, కాంగ్రెస్ పార్టీనే దేశ రాష్ట్రాల భవిష్యత్తుకు మార్గదర్శకమని క్యామ రాజేష్ ధీమా వ్యక్తం చేశారు.

విజయవంతమైన రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - అమనగల్లు : మై విలేజ్ మాడల్ విలేజ్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతల బాలరాజ్ గౌడ్, శృతిలయ కల్చరల్ అకాడమీ, సాయిరాం మెడికల్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి వారిచే ఆమనగల్లు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 86 మంది రక్తదాతలు రక్తదానం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము, మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ అధ్యక్షులు చింతల నితిన్ గౌడ్, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు చిత్తరంజన్ దాస్, సలహాదారులు జిఎచ్ఎం శంకర్, జనరల్ సెక్రెటరీ విజయ్ కుమార్, పాపిశెట్టి రాము, సంఘ సభ్యులు శ్రీను, భాస్కర్, లక్ష్మీపతి, మహమ్మద్, శృతిలయ అకాడమీ సభ్యులు అభినవ్ రెడ్డి, జంగయ్య, కవిత, శ్రీశైలం, కృష్ణ, ఉదయ్, నర్సింగ్ ఆఫీసర్ రామాంజనేయులు, హరికృష్ణ, నాగర్ కర్నూల్ జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు పీకే గౌడ్, ఎన్ఎస్యుఐ ఫరీద్, వడ్డేమోని శివకుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుండిగల్ : ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గాజుల రామారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన చౌదరి కృష్ణవేణికి రూ.49,00, వెలుగలా పుష్పమ్మకు రూ.60,000, ఈరప్ప పంచల్ రూ.60,000, పల్లపు రేణుక రూ.60,000ల చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేద, మధ్య తరగతి ప్రజలకు కొండంత అండగా మారిందని, ప్రజా ప్రభుత్వంలో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. నిరుపేద ప్రజలకు ఆసుపత్రలో మెరుగైన వైద్యం నిమిత్తం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఓసిను అందజేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్లలో ఇందూ ఆయుర్వేద క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఆయుర్వేదం మన సంప్రదాయ చికిత్స, మందుల ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా అన్నారు. నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందు ఆయుర్వేద హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాస్పిటల్ వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రాచీన వైద్య చికిత్సలో ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆయుర్వేద హాస్పిటల్‌ను అందరికీ అందుబాటులో ఉండేలా నల్లగండ్లలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయుర్వేదం మన సంప్రదాయ చికిత్స, దీని ద్వారా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ఎంతోకాలంగా ఆయుర్వేద చికిత్స విధానాలను అనుసరిస్తున్నానని, తద్వారా 35 ఏళ్ల పాటు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వానికి సేవలందించానన్నారు. మానసిక, శారీరక రుగ్మతలతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం మెరుగైన వైద్య చికిత్సలో ఆయుర్వేదంలో అందుబాటులో ఉన్నాయని వైద్యులు ప్రదీప్ నోరి అన్నారు. ఈ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ పవన్ మల్లాడి, కార్యక్రమంలో డాక్టర్ వంశీధర్ అల్లం, డాక్టర్ సుష్మ పాల్గొన్నారు.

నోటి దుర్వాసనకు ఆయుర్వేద వైద్యం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: నోటి దుర్వాసన, లేదా హాలిటోసిస్, సామాజికంగా బాధ కలిగించవచ్చు. విశ్వాసం, వ్యక్తుల మధ్య పరస్పర చర్యలను ప్రభావితం చేస్తుంది. ఇది తరచుగా పేలవమైన నోటి పరిశుభ్రత, ఆహార ఎంపికలు, పొగాకు దుర్వినియోగం, కొన్ని మందులు లేదా అంతర్లీన ఆరోగ్య పరిస్థితుల నుండి వస్తుంది. అప్పుడప్పుడు నోటి దుర్వాసన సర్వసాధారణం, తరచుగా ఆహార వినియోగం లేదా ఉదయం శ్వాసకు సంబంధించినది. అయినప్పటికీ, నిరంతర హాలిటోసిస్ చిగుళ్ల వ్యాధి లేదా నోరు పొడిబారడం వంటి అంతర్లీన సమస్యకు సంకేతం కావచ్చు. నోటి దుర్వాసన కారణాలను అర్థం చేసుకోవడం దానిని సమర్థవంతంగా పరిష్కరించడానికి మొదటి అడుగు. నోటి దుర్వాసన ప్రధానంగా నోటిలో బ్యాక్టీరియా పేరుకుపోవడం వల్ల వస్తుంది. బాక్టీరియా ఆహార కణాలను విచ్ఛిన్నం చేస్తుంది, దుర్వాసనతో కూడిన సల్ఫర్ సమ్మేళనాలను ఉత్పత్తి చేస్తుంది. నోరు పొడిబారడం, ధూమపానం చేయడం మరియు ఉల్లిపాయలు మరియు వెల్లుల్లి వంటి కొన్ని ఆహారాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. బాక్టీరియా నోటి యొక్క వెచ్చని, తేమతో కూడిన వాతావరణంలో, ముఖ్యంగా నాలుకపై వృద్ధి చెందుతుంది, ఇక్కడ అవి పేరుకుపోతాయి మరియు వాసన కలిగించే సమ్మేళనాలను ఉత్పత్తి చేస్తాయి. పేలవమైన నోటి పరిశుభ్రత పద్ధతులు, బ్రష్ మరియు ఫ్లాస్లను క్రమం తప్పకుండా విస్మరించడం వంటివి ఈ బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి అనుమతిస్తాయి. నోరు పొడిబారడం, తరచుగా మందులు లేదా వైద్య పరిస్థితుల వల్ల లాలాజలం ఉత్పత్తిని తగ్గిస్తుంది, ఇది సాధారణంగా నోటిని శుభ్ర పరచడానికి సహాయపడుతుంది. వెల్లుల్లి మరియు ఉల్లిపాయలు వంటి కొన్ని ఆహారాలు రక్తప్రవాహంలోకి శోషించబడతాయి, ఊపిరితిత్తుల ద్వారా ఊపిరితిత్తుల ద్వారా బయటకు వచ్చే సమ్మేళనాలను కలిగి ఉంటాయి, నోటి దుర్వాసనకు దోహదం చేస్తాయి.

ఆపరేషన్ సిందూర్

పాక్ దుశ్చర్యకు సమాధానం

- ఉద్రిక్తతలు పెంచితే పర్యవసానాలు తప్పవు
- కవ్వింపులకు దీటుగా బదులిస్తాం
- దాయాది దేశానికి భారత్ స్పష్టీకరణ
- ఉగ్రవాదులకు అధికార లాంఛనాలతో అంత్యక్రియాలా: మిస్రీ
- ప్రతి చర్యల్లో భాగంగానే లాహోర్ రక్షణ వ్యవస్థ ధ్వంసం: కల్నల్ ఖురేషి

న్యూదిల్లీ: పాకిస్థాన్ దుశ్చర్యకు సమాధానంగా ఆపరేషన్ సిందూర్ జరిగిందని భారత్ మరోమారు స్పష్టం చేసింది. ఉద్రిక్తతలు పెంచితే పర్యవసానాలు తప్పబోవని దాయాది దేశాన్ని హెచ్చరించింది. పాకిస్థాన్ దాడులకు ప్రతిస్పందనగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్లు వెల్లడించింది. పాకిస్థాన్ పద్ధతి మర్చుకోకుండా రెచ్చగొట్టే చర్యలు, దాడులను కొనసాగిస్తే దీటైన ప్రతి స్పందన తప్పబోదని తేల్చిచెప్పింది. ఉద్రిక్తతలకు తెరలేపింది దాయాది దేశమేనంటూ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో విదేశాంగ-రక్షణ శాఖల సంయుక్త విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ఉద్రిక్తతలు పెంచే ప్రయత్నం కాదని, పహల్గాం ఉగ్రదాడికి ప్రతి స్పందన మాత్రమేనని స్పష్టం చేశారు. ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 15 ప్రాంతాలపై దాడులకు పాక్ యత్నించిందని, వాటిని సమర్థంగా తిప్పికొట్టామని కల్నల్ ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమిక తెలిపారు. పాకిస్థాన్ క్షిపణులను పేల్చేశామన్నారు. లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. పాక్ సంయమనం పాటిస్తూ ఒప్పందాలను గౌరవిస్తే తప్ప శాంతికి కట్టుబడలేమని సైన్యాధికారులు వెల్లడించారు. దేశ సార్వభౌమత్వాన్ని, పౌరుల భద్రతను కాపాడుకోవడంలో రాజీ ప్రసక్తే లేదన్నారు. విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ ఉగ్రవాదులకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించే పాకిస్థాన్ సంప్రదాయం అర్థరహితమని విమర్శించారు. ప్రార్థనా స్థలాలపై భారత్ ఉద్దేశపూర్వకంగా దాడులు చేసిందన్న పాకిస్థాన్ వాదనల్లో నిజం లేదన్నారు. జమ్మూకశ్మీర్, పూంచ్‌లో సిక్కులు లక్ష్యంగా పాకిస్థాన్ దాడి చేసిందంటూ... గురుద్వారాపై దాడి, ముగ్గురు మరణించడాన్ని ఉద్దేశించి మిస్రీ అన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా పాకిస్థాన్‌కు గుర్తింపు ఉందని దుయ్యబట్టారు. 'ఒసామా బిన్ లాడన్ ఆచూకీ ఎక్కడ లభించిందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు... ఐరాస నిషేధిత ఉగ్రవాదులకు స్వర్గధామం పాకిస్థాన్, తమ దేశానికి ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్లు పాక్ రక్షణ, మాజీ విదేశీ మంత్రి స్వయంగా ఒప్పుకున్నారు' అని మిస్రీ వ్యాఖ్యానించారు. సింధూ జల సంధి ప్రస్తుత పరిస్థితులకు ఏ మాత్రం అనుకూలం కాదని, అందుకు సవరణలు ఎంతో అవసరమని తెలిపారు. దీనిపై రెండేళ్లకుపైగా పాకిస్థాన్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. 1950-60 నాటి పరిస్థితులకు అనుగుణంగా సింధూ జల సంధి జరిగిందని, దీనిని 65ఏళ్ల పాటు భారత్ గౌరవించిందని, యుద్ధ సమయాల్లోనూ ఒప్పందానికి కట్టుబడిందని, నేటి సాంకేతికతల దృష్ట్యా ఈ ఒప్పందాన్ని మార్చుకోవాలని అన్నారు. ఉత్తర- పశ్చిమ భారతంలోని 15 ప్రాంతాలైన అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, లుధియానా, ఆదంపూర్, భటిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, ఉత్తర్‌లై, భుజ్‌లోని సైనిక స్థావరాలపై పాక్ దాడులను ఇండిగ్రేటెడ్ కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ (గ్రిడ్& గగనతల రక్షణ వ్యవస్థ)తో సమర్థంగా తిప్పికొట్టినట్లు కల్నల్ సోఫియా ఖురేషి వెల్లడించారు. పాక్‌ను కట్టడి చేసేందుకు ఫిరంగుల దాడులు, కాల్పులను ఆపేందుకు భారత్ తరపున ప్రతి చర్యలు తప్పడం లేదని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ అన్నారు. మరింత ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పాకిస్థాన్ వైఖరి ఉంటే తప్ప సంయమం పాటించలేమన్నారు. ముంబై, ఉరి, పుల్వామా, పఠాన్‌కోట్ దాడులను మిస్రీ గుర్తుచేశారు. ఎన్ని ఆధారాలు చూపినా దాయాది దేశం పట్టించుకోలేదని, దర్యాప్తులు జరగనివ్వలేదన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత్ ప్రయత్నాలకు పాకిస్థాన్ మతం రంగు పులుముతోందని ఆరోపించారు. ఉగ్రదాడులను మతాలకతీతంగా భారతీయులు ఖండిస్తున్నారని, సామాన్యులపై దాడులతో ఉద్రికత్తలను పాకిస్థాన్ పెంచుతోందని మిస్రీ అన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకే పాక్‌పై ప్రతిచర్యలు అనివార్యమయ్యాయని తెలిపారు. నీలం-ఝీలం ప్రాజెక్టును భారత్ లక్ష్యంగా చేసుకుందని పాకిస్థాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. అసత్య ప్రచారాల పర్యవసానాలకు పాకిస్థాన్‌దే బాధ్యతన్నారు. 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ దుశ్చర్యకు సమాధానం మాత్రమేనని, పౌరులను కాపాడుకునే హక్కు భారత్‌కు ఉందన్నారు. పహల్గాం ఘటనపై సంయుక్త విచారణను పాకిస్థాన్ కోరుతోంది కానీ ఆ దేశానికి అలా కోరే అర్హత లేదని దుయ్యబట్టారు. పాక్ ఎలాంటి చర్యలు తీసుకున్నా భారత్ దీటుగానే బదులిస్తుందని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.

రహదారులను నంబర్ వన్‌గా తీర్చిదిద్దండి

పౌరసరఫరాల వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని రహదారులను అత్యుత్తమ నాణ్యత-నిర్వహణ కలిగి ఉండేలా తీర్చిదిద్దాలని, తలపెట్టిన అన్ని రహదారుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రతి రహదారి పనులకు గడువును నిర్దేశించి, అనుకున్న సమయానికల్లా కార్యరూపం దాల్చేలా చూడాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై సమీక్ష నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకం చేశారు. వర్షాకాల రాకముందే రోడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. 8,744 కి.మీ వరకు రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులు జాతీయ స్థాయిలోనే నంబర్ వన్‌గా ఉండాలని సూచించారు. పూర్తిగా పాడైన 2,683 కి.మీ. రహదారులను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. రూ.860 కోట్లతో 20,060 కిలోమీటర్ల పొడవునా గుంతలు లేకుండా చేపట్టిన మరమ్మతుల పనులు 97శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని, ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఏఐ, మార్త్‌కి సంబంధించి రూ.78,295 కోట్లతో 3,510 కిలోమీటర్ల పొడవైన... 146 పనులు జరుగుతున్నాయని సీఎంకు అధికారులు వివరించారు. అనంతరం పౌరసరఫరాల శాఖలో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీ, దీపం-2 పథకం అమలు, ధాన్యం సేకరణలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు, అవకతవకలు జరగకుండా మొత్తం వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశించారు. ప్రజలు పూర్తి సంతృప్తి చెందేలా సేవలు అందించాల్సి ఉందన్నారు. ఎక్కడా రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరగకుండా చూడాలని, రైస్ కార్డులో పేర్లు నమోదైనప్పటికీ, జీఎస్‌డబ్ల్యూఎస్ డేటాలో లేని 79,173 మంది వివరాలపై వెంటనే పరిశీలించి సరిచేయాలని చెప్పారు. మరోవైపు, రైస్ కార్డులకు సంబంధించి ఈనెల 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర కింద సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈనెల 7 నుంచి కొత్త రైస్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, స్ప్లిట్టింగ్, అడిషన్, డిలీషన్, సరెండర్, చిరునామా మార్పు, ఉన్నతీకరణ తదితర 7 సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. గడిచిన ఖరీఫ్ సీజన్‌లో 35.94 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 14.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల దగ్గర నుంచి సేకరించామని అధికారులు సీఎంకు వివరించారు. రైతులకు ఖరీఫ్‌లో రూ.8,278 కోట్లు, రబీలో రూ.3,076 కోట్లు ధాన్యం సేకరణ నిమిత్తం చెల్లించినట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర నూతన కౌలు చట్టం తీసుకురావాలి

- అన్నదాత సుఖీభవ తక్షణమే అమలు చేయాలి
- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- ఆర్డీటీ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతుల సంక్షేమానికి సమగ్ర నూతన కౌలు చట్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గసభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని గురువారం కలిసిన సీపీఐ ప్రతినిధి బృందం వివిధ ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చింది. ముఖ్యంగా రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. 2025-2026 ఖరీఫ్ సీజన్ ప్రారంభం కంటే ముందే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు అందించాలి. రైతులతో పాటు కౌలురైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేయాలి. అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల వరి, మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయి. మామిడి, అరటి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు ధ్వంసమయ్యాయి. రైతాంగానికి తీవ్ర ఆర్థిక నష్టం జరిగింది. ఆహార పంటలకు ఎకరానికి రూ.30 వేలు, ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ.75 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం చెల్లించాలి. అకాల వర్షాల వల్ల రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేయాలి. ఇప్పటివరకు ప్రభుత్వం కొంతమేరకు ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ... ఇంకా ఏలూరు, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ తదితర జిల్లాల్లో ధాన్యం కల్లాల్లోనే ఉంది. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని నాయకులు కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ధాన్యం రైతుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, దానిపై వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఆర్‌డీటీ అంశాన్ని పరిష్కరించండి

కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచి... అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ)కు ఎఫ్‌సీఆర్‌ఏ క్రింద వివిధ దేశాల నుండి అందే సహాయం పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. 1969లో విన్సెంట్ ఫెర్రర్, అన్నే ఫెర్రర్ దంపతులు ఆర్‌డీటీని అనంతపురం జిల్లాలో స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం, బాధలు, అన్యాయాలను నిర్మూలించడానికి, సమాన అవకాశాలు, సంపదను అందరికీ అందించడానికి ఈ సంస్థను ప్రారంభించారు. సంస్థను ఏర్పాటు చేసిన తర్వాత కరువు పీడిత ప్రాంతాల్లో 'ఫుడ్ ఫర్ వర్క్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. తద్వారా వేలాదిగా బావులు తవ్వటం, లక్షలాది గృహాల నిర్మాణం, కుష్టు వ్యాధి కేంద్రం స్థాపన వంటి వనులు చేపట్టింది. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి కూలీలను రైతులుగా మార్చడంలో సహాయపడింది. మహిళలు, పిల్లలు, అంగ వైకల్యం ఉన్న వ్యక్తులు, గిరిజన వర్గాల అభివృద్ధి కోసం ఆ సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. విద్య, వైద్యం, గృహనిర్మాణం, స్థిరమైన జీవనోపాధి, సాంస్కృతిక క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు మెరుగువరచడానికి మొబైల్ లైబ్రరీలు, ట్యూషన్ స్కూళ్ల ఏర్పాటు చేయడమే కాకుండా స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. బత్తలపల్లి, కల్యాణదుర్గం, కనేకల్లలో రెండు సెకండరీ అనుపత్రులు, ఒక ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ స్థాపించింది. రోజువారీ 3,000 మంది పేదలు ఈ అనువత్రుల సేవలను వినియోగిస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆదాయ ఉత్పత్తి కార్యక్రమాలు, వృత్తి శిక్షణలు, మహిళల భద్రత, సమానత్వం కోసం కార్యక్రమాలు నిర్వహించింది. వైకల్యంతో బాధపడుతున్న వారి కోసం కమ్యూనిటీ బేస్డ్ రీహాబిలిటేషన్ సెక్టార్ స్థాపించి, కృత్రిమ అవయవాలు, పునరావాస కేంద్రాలు, ఉపాధి అవకాశాలు అందిస్తున్నది. ఎకాలజీ సెక్టార్ ద్వారా నీరు, నేల పరిరక్షణ, అటవీకరణ, హార్టీకల్చర్ ప్రవేశపెట్టింది. వేలాదిమంది రైతులకు మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలు అందించి, నీటి అదా ఉత్పత్తి పెంపు సాధించింది. సౌర ఫలకాల సహాయంతో స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నది. 2012లో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ నుండి గృహ నిర్మాణంలో అత్యుత్తమ సేవలకు గుర్తింపు లభించింది. ఫెర్రర్ మరణానంతరం ఆయన కుమారుడు మంచో ఫెర్రర్ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలలో మన్ననలు పొందారు. పేదల సంస్థగా పేరొందిన ఆర్డీటీ నెత్తిన కేంద్ర ప్రభుత్వం బాంబు పేల్చింది. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్ఆర్ఏ) కింద వివిధ దేశాల నుంచి ఆర్డీటీకి అందుతున్న సహాయానికి సంబంధించి వునరుద్ధరణను నిలిపి చేసింది. ఫలితంగా భవిష్యత్తులో ఆర్డీటీ నిధుల కొరతతో కొట్టుమిట్టాడే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులే కాకుండా నేరుగా విదేశాల నుంచి నిధులు తెచ్చి అనంతపురం జిల్లాతోపాటు రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లో వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఫెర్రర్ కృషి చేస్తున్నారు. అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలతోపాటు తదితర ప్రాంతాల్లో ఆర్డీటీ సేవలు దాదాపుగా 3 వేలకు పైగా గ్రామాల్లో కొనసాగుతున్నాయి. మొదట ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంస్థ చేపట్టిన సేవలు ప్రస్తుతం ఏపీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు విస్తరించాయి. అలాంటి సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధులను రాకుండా కేంద్రం అడ్డుకోవడంతో సంస్థ సేవల అమలులో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఫలితంగా పేదలకు తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రాయలసీమ ప్రాంతంలో రాజకీయాల కతీతంగా పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు సమాయత్తమవుతున్నారు. కావున తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి... ఆర్డీటీ సంస్థకు వివిధ దేశాల నుండి అందే ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎఫ్‌సీఆర్‌ఏ వునరుద్ధరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని సీపీఐ నేతలు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో డైరెక్టర్ల బాధ్యతల స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో నూతన డైరెక్టర్లు విజయవాడలోని విద్యుత్ సౌధాలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హెచ్‌ఆర్ అండ్ ఐఆర్)గా వేములపల్లి ఉష, థర్మల్ డైరెక్టర్‌గా పి. అశోక్ కుమార్ రెడ్డి, హైడెల్ డైరెక్టర్‌గా ఎం.సుజయ్ కుమార్, ఏపీ ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్‌గా జె.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఉష మాట్లాడుతూ, ఉద్యోగులు, సిబ్బంది సుహృద్భావ వాతావరణంలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సర్వీస్, ఫిర్యాదుల పరిష్కారం, ఉద్యోగుల్లో నైపుణ్య అభివృద్ధి పెంపుదల, ఉద్యోగుల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామన్నారు. అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో సామర్థ్యం పెంపు, పాత యూనిట్ల ఆధునీకరణ, పర్యావరణ నియమాలు, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సుజయ్ కుమార్ మాట్లాడుతూ జల విద్యుత్ ఉత్పత్తి మెరుగుదల, సంస్థ బలోపేతం అంశాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను మరింత సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా చేయడమే లక్ష్యమన్నారు. నూతన డైరెక్టర్లు ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత వ్యతిరేక ప్రచారాన్ని ఉపేక్షించొద్దు

న్యూదిల్లీ: సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతిరేక ప్రచారంపై నిఘా ఉంచాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిన అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలు రాష్ట్రాల సీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో హోం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు పలు సూచనలు చేసినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను భారత్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తోంది. ఇదే సమయంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హోంశాఖ సూచనలు చేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి, భారత్ భద్రత గురించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే ఖాతాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దేశం నుంచి లేదా విదేశాల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఆయా సోషల్ మీడియా ఖాతాలను వెంటనే బ్లాక్ చేయాలని పేర్కొంది. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రభుత్వాలకు, భద్రతా దళాలకు మధ్య కమ్యూనికేషన్ సంబంధాలు పెంచాలని పిలుపునిచ్చింది.

మీ వ్యాఖ్యల కింద నలిగిపోవడానికి

కోర్టులు పువ్వులంత పెళుసు కాదు

న్యూదిల్లీ: బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే... తనకు, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కి వ్యతిరేకంగా చేసిన 'అవమానకర వ్యాఖ్యలపై' సుప్రీం కోర్టు గురువారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన సుప్రీం కోర్టు అధికారానికి 'అపకీర్తి' కలిగించే, తగ్గించే ధోరణి ప్రదర్శించారని వ్యాఖ్యానించింది. అదే సమయంలో ఇటువంటి హాస్యాస్పదమైన ప్రకటనల కింద వాడిపోవడానికి కోర్టులు పువ్వులంత పెళుసుగా ఉండవని తాము దృఢంగా అభిప్రాయపడుతున్నాం' అని సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలయిన పిటీషన్లు విచారించినందుకు సుప్రీం కోర్టును దూబే తీవ్రంగా విమర్శించారు. 'సుప్రీం కోర్టు దేశాన్ని అరాచకం వైపు తీసుకువెళుతోంది. దేశంలో జరుగుతున్న అంతర్యుద్ధాలకు భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా బాధ్యత వహించాలి' అంటూ బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దూబే వ్యాఖ్యలపై ధిక్కార చర్య తీసుకోవాలంటూ దాఖలయిన పిటిషన్‌ను మే 5న విచారణ చేసిన ధర్మాసనం... వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలయిన పిటిషన్లను విచారించినది తామేనని పేర్కొంది. ధర్మాసనం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చినప్పటికీ... గురువారం విడుదల చేసిన తన ఉత్తర్వులో బీజేపీ ఎంపీపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పరిశీలన తర్వాత దూబే వ్యాఖ్యలు... 'భారత సుప్రీం కోర్టు అధికారాన్ని తగ్గించడానికి లేదా ఈ కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న న్యాయ విచారణలో జోక్యం చేసుకోవడానికి కారణమవుతాయన్నది 'నిస్సందేహం' అని ధర్మాసనం పేర్కొంది. 'మా అభిప్రాయం ప్రకారం దూబె వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారహితంగా ఉన్నాయి. సుప్రీం కోర్టు, అలాగే సుప్రీం కోర్టు న్యాయమూర్తులపై విమర్శలు చేయడం ద్వారా దేశం దృష్టిని ఆకర్షించే ప్రవృత్తిని ప్రతిబింబిస్తాయి' అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు న్యాయ పరిపాలనలో జోక్యం చేసుకుని, ఆటంకం కలిగించే ధోరణిని తెలియజేస్తోందని ధర్మాసనం ఆక్షేపించింది. 'భారతదేశంలో జరుగుతున్న అన్ని అంతర్యుద్ధాలకు సీజేఐ బాధ్యత వహించాలి. ఈ దేశంలో మత యుద్ధాలను ప్రేరేపించడానికి సుప్రీం కోర్టు మాత్రమే బాధ్యత వహించాలి' అని పేర్కొనడం ద్వారా ధర్మాసనానికి ఉద్దేశాలు ఆపాదించాలనే స్పష్టమైన లక్ష్యం ప్రతిబింబిస్తోంది' అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానాల పాత్ర...రాజ్యాంగం ప్రకారం వాటికి ఇవ్వబడిన విధులు, బాధ్యతల గురించి పార్లమెంటు సభ్యుడి వ్యాఖ్యలు అతని అజ్ఞానాన్ని చూపిస్తున్నాయని పేర్కొంది.

మా సహనాన్ని పరీక్షించొద్దు

పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దాడులకు పాల్పడటంతో పాకిస్థాన్‌పై యుద్ధ మేఘాలు కమ్మేశాయి. సరిహద్దుల వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పబోవని భారత్ తేల్చిచెప్పింది. మా సహనాన్ని పరీక్షించవద్దంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దాయాది దేశాన్ని హెచ్చరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ జరగడంతో భారత్‌లోని సైనిక స్థావరాలపై దాడులకు పాక్ యత్నించింది. అయితే భారత్ ఆ దాడులను తిప్పికొట్టింది. భారత్ సహనంగా ఉండటాన్ని అలుసుగా తీసుకోవద్దని పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. కవ్వింపులు-రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలు తప్పబోవని హెచ్చరించారు. 'నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్'లో మాట్లాడిన ఆయన దేశ భద్రతపై రాజీ పడబోమన్నారు. 'మేము సంయమంతో బాధ్యతగా చర్యలు తీసుకుంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని భావిస్తాం. అలాగనీ మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే. ఆపరేషన్ సిందూర్ తరహా పర్యవసానాలకు సిద్ధంగా ఉండాలి' అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. కచ్చితత్వంతో ఆపరేషన్ సిందూర్ అమలు చేసిన సైన్యాన్ని రక్షణమంత్రి మెచ్చుకున్నారు.

సీఎంను కలిసిన ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడును ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో గురువారం కలిసింది. రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు మే 31 వ తేదీతో ముగుస్తున్నందున జూన్ 1వ తేదీన నూతన అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిన ఆవశ్యకతను యూనియన్ నాయకులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దానికి అనుగుణంగా నూతన అక్రిడిటేషన్ నియమావళికి ఆమోదం తెలిపి కొత్త జీవో జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు సీఎంకు వినతిపత్రం అందజేశారు. దానిపై సీఎం సానుకూలంగా స్పందించారు. త్వరలో ఒంగోలులో జరగనున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర 36వ మహాసభల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని యూనియన్ నేతలు సీఎంను ఆహ్వానించారు. యూనియన్ రాష్ట్ర మహాసభల ప్రారంభ కార్యక్రమానికి సీఎం హాజరు కావడం చిరకాలంగా కొనసాగుతున్న ఆనవాయితీ అని వివరిస్తూ, గతంలో అనేక సార్లు మహాసభలకు చంద్రబాబు హాజరయిన విషయాన్ని యూనియన్ నాయకులు గుర్తు చేశారు. ఒంగోలు మహాసభకు హాజరయ్యేందుకు సీఎం సానుకూలంగా స్పందించి... తన కార్యాలయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సీఎంను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణ ఉన్నారు.

ముఖ్యమంత్రికి భద్రతా చర్యలు పటిష్టం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పహల్గాం ఉగ్రదాడితో పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ ప్రతీకార చర్యలకు దిగిన నేపథ్యంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ప్రజలు, సంస్థల రక్షణతోపాటు వీఐపీల భద్రతపై గురువారం అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రక్షణ విషయంలో మరింత పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ ఉన్నతాధికారులను డీజీపీ ఆదేశించారు. సెక్యూరిటీ ప్రొటోకాల్స్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఎక్కడా రాజీపడొద్దని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు.

కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులు ప్రదానం చేసిన గవర్నర్ నజీర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పేద రోగులకు ఉచితంగా రెడ్‌క్రాస్ రక్తం అందజేస్తున్నట్లు గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు అయిన గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన ప్రపంచ రెడ్ క్రాస్, అంతర్జాతీయ తలసే మియా దినోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లా దుతూ రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ 20 రక్తదాన కేంద్రాలను నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం 65 వేలకు పైబడి రక్త యూనిట్లను సేకరిస్తోందని, లక్షకు పైగా యూనిట్లను అవసరమైన నిరుపేదలకు అందజేస్తోందని తెలిపారు. వీటిలో మూడొంతులు ప్రభుత్వ ఆసుపత్రులకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ ఉద్యమం కోసం విశేష సేవలు అందించి గరిష్టంగా విరాళాలు సమీకరించిన జిల్లా కలెక్టర్లకు గవర్నర్ పురస్కారాలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ అవార్డు తన ఒక్కరి సొంతం కాదని, వరద బాధితులకు సహాయం చేసిన ప్రతి ఒక్కరి కృషికి ఇది గుర్తింపు అన్నారు. తూర్పు గోదావరి కలెక్టర్ పి.ప్రశాంతి, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు కలెక్టర్ ఓ.ఆనంద్, నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి, కాకినాడ కలెక్టర్ సాగిలి షాన్ మోహన్, కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా, బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి పతకాలు అందుకున్న వారిలో ఉన్నారు. తొలుత గవర్నర్ రాజ్‌భవన్ నుంచి వర్చువల్ విధానంలో శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో స్థాపించిన రెడ్ క్రాస్ తలసేమియా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. కాకినాడలో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ చైల్డ్ కేర్, మహిళా సంక్షేమం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిలాఫలకాన్ని కూడా గవర్నర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్, రెడ్‌క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి.రామారావు, సీఈఓ ఎ.కె.పరీడా, వివిధ జిల్లా శాఖల చైర్మన్లు, రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.